

డబుల్ డెక్కర్ బస్సు సిద్ధం

పర్యాటకులను ఆకర్షించేందుకు బీచ్ రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సు నడపనున్నారు. ఇది పూర్తిగా అద్దాలతో ఉంటుంది. ఇందులో కూర్చొని ప్రయాణిస్తూ బీచ్ అందాలను ఆస్వాదించవచ్చు. దీనిని ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వరకు నడపనున్నారు. ప్రస్తుతం ఈ బస్సు సింహాచలం దేవస్థానం గోశాల వద్ద ఉంది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి





ఉక్కు ప్రైవేటు బాట

మూడు విభాగాల్లో కన్వేయర్ బెల్ట్‌ల నిర్వహణ బాధ్యతలు కాంట్రాక్టుకు ఇచ్చేందుకు నిర్ణయం

- రూ.19.1 కోట్లకు టెండర్ల ఆహ్వానం
- కాంట్రాక్టు కార్మికుల స్థానంలో సంస్థలతో పనులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం దూకుడుగా వెళుతోంది. ఇప్పటికే వేల సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులను తొలగించిన సంగతి తెలిసిందే. ప్లాంటులో కీలకమైన పనులు చేసే కాంట్రాక్టు కార్మికులు తగ్గిపోతే నిర్వహణ పనులు ఎలాగని అధికారులే ప్రశ్నిస్తున్నారు. వారి సంఖ్య తగ్గించడం వల్లే కొన్ని విభాగాల్లో నిర్వహణ పనులు ఆగిపోయి, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఇటీవల జరిగిన ఘటనలను ఉదహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కీలకమైన మూడు (మెకానికల్,



ఎలక్ట్రికల్, కన్వేయర్ బెల్ట్‌ల నిర్వహణతో పాటు హౌస్ కీపింగ్ బాధ్యతలు) విభాగాల్లో పనులను ప్రైవేటు సంస్థలకు కాంట్రాక్టుపై ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించి టెండర్లను కూడా ఆహ్వానించింది. ఐరన్‌ఓర్‌ను సరఫరా చేసే కన్వేయర్లు, బాయిలర్ కోల్, ఇతర ముడి పదార్థాలను అందించే కన్వేయర్లు, అక్కడి పరికరాల నిర్వహణ పనులు చేపట్టడానికి అర్హులైన వారు ముందుకు రావాలని పిలుపునిచ్చింది. మెకానికల్, ఎలక్ట్రికల్ నిర్వహణ పనుల కోసం 31 కన్వేయర్లు, మరో విభాగంలో హౌస్ కీపింగ్, నాలుగు యార్డులు, 26 కన్వేయర్ల నిర్వహణకు ఇంకో కాంట్రాక్ట్, బొగ్గు సరఫరాకు సంబంధించి 18 కన్వేయర్లు, పరికరాలతో కూడిన తొమ్మిది ప్లాంట్లను నెలవారీ నిర్వహణకు ఇస్తామని ప్రకటించింది. సరఫరాకు అంతరాయం లేకుండా, ప్రమాదాలు జరగకుండా, ఉత్పత్తికి విఘాతం లేకుండా ఆయా విభాగాలను నిర్వహించాలని (టోటల్ మెయింటెనెన్స్) సూచించింది. మొదటి విభాగంలో రూ.7.15 కోట్లు, రెండో విభాగంలో రూ.6.41 కోట్లు, మూడో విభాగంలో రూ.5.58 కోట్లు కలిపి మొత్తం రూ.19.1 కోట్లకు కాంట్రాక్టు ఇస్తామని, ఈ నెల మొదటి వారంలోగా బిడ్లు సమర్పించాలని పేర్కొంది. వీటి ద్వారా వచ్చే ఫలితాలను చూసి మిగిలిన విభాగాల్లోను సిబ్బందిని తగ్గించి, వాటిని కూడా ప్రైవేటుకు ఇవ్వాలని భావిస్తోంది.

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

- జిల్లాలో సుమారు 9,11,000 మంది లబ్ధిదారులు
- ఇప్పటివరకూ 6,58,000 మంది ఈకేవైసీ పూర్తి
- మిగిలిన వారి ఇళ్లకు వెళ్లి ప్రక్రియను చేపడుతున్న ఏఎన్ఎంలు
- రూ.5 లక్షల వరకూ ఉచిత వైద్యం



విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఆయుష్మాన్ భారత్ కార్డుదారుల ఈకేవైసీ ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఆరోగ్య శాఖ అధికారులు ప్రతి ఏఎన్ఎంకు వారి పరిధిలోని ఆయుష్మాన్ భారత్ కార్డుదారుల జాబితాను అందించి ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్‌కు జిల్లాలో సుమారు 9,11,000 మంది లబ్ధిదారులుగా ఎంపిక కాగా, ఇప్పటి వరకూ 6,58,000 మంది ఈకేవైసీ పూర్తయ్యింది. ఏఎన్ఎంలు ప్రతిరోజూ పది మంది లబ్ధిదారులను కలిసి ఈకేవైసీ చేయాలని అధికారులు ఆదేశించారు. రెండు నెలల్లో ఈకేవైసీ పూర్తిచేయాలని భావిస్తున్నారు.

ఉచిత వైద్య సేవలు

ఆయుష్మాన్ భారత్ కార్డుదారులు గరిష్ఠంగా ఐదు లక్షల రూపాయల వరకూ వైద్య సేవలు ఉచితంగా పొందేందుకు అవకాశం ఉంది. జిల్లాలో ఎన్‌టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలో గల అన్ని ఆస్పత్రుల్లోనూ ఆయుష్మాన్ హెల్త్ కార్డు ద్వారా సేవలను పొంద వచ్చు. వైద్య సేవలు అందించినందుకు గాను ఆయా ఆస్పత్రులకు కేంద్ర ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంతోపాటు పక్క రాష్ట్రమైన తెలంగాణలోని కొన్ని ఆస్పత్రుల్లో వైద్య సేవలు ... మిగతా 6వ పేజీలో

మెడ్‌టెక్ జోన్‌కు రూ.8.5 కోట్లు

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):

అగనంపూడిలోని మెడ్‌టెక్ జోన్‌కు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి క్వార్టర్‌కు రూ.8.5 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఇంకో రూ.25.5 కోట్లను దశల వారీగా ఏడాది పూర్తయ్యేలోగా ఇస్తారు.

కాంక్రీట్ మిక్సర్లతో రహదారులు నాశనం

దారిపొడవునా కాంక్రీట్...

- గంటల్లోనే ఘనీభవించి... ప్రమాదాలకు ఆస్కారం
- నగర శివార్లలో కుప్పలుగా కాంక్రీట్ వ్యర్థాలు
- పట్టని జీవీఎంసీ అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో రహదారులను పరిశుభ్రంగా, ప్రమాద రహితంగా ఉంచాలని అధికార యంత్రాంగం ప్రయత్నిస్తుంటే కొందరు వాటికి నష్టం కలిగిస్తున్నారు. వారి పనులే ముఖ్యంగా భావించి ఇతర అంశాలను విస్మరిస్తున్నారు. ముఖ్యంగా భారీ భవనాల నిర్మాణానికి కాంక్రీట్ మిక్సర్‌ను తరలించే లారీలు నగరంలో ఇష్టానుసారంగా నడుస్తున్నాయి.



వీఐపీ మార్గంలో షాపర్స్ స్టాప్ ఎదురుగా రోడ్డుపై కాంక్రీట్ మిక్సర్



సిరిపురంలో రహదారి పక్కనే యంత్రాలు పెట్టుకొని అక్కడే కాంక్రీట్ మిక్సింగ్ చేస్తున్న దృశ్యం.

ఇంధనంతో నిండిన వాహనాలను ఎంత జాగ్రత్తగా నడుపుతారో వీటిని కూడా అంతే జాగ్రత్తగా, నెమ్మదిగా నడపాల్సి ఉంది. పొరపాటున వాటి నుంచి కాంక్రీట్ మిక్సర్ కిందిపడితే అది కొద్ది గంటల్లోనే మళ్లీ తీయడానికి వీల్లేకుండా రోడ్డుకు అతుక్కుపోతుంది. చక్కటి తారు రోడ్లపై కాంక్రీట్ ముద్దలు ముద్దలుగా పేరుకుపోయి స్పీడ్ బ్రేకర్‌గా తయారవుతోంది. వాటిపై నుంచి ద్విచక్ర వాహనాలు అజాగ్రత్తగా వెళితే ప్రమాదాలు జరుగుతాయి. సాధారణంగా ఈ లారీల నుంచి కాంక్రీట్ కింద పడకుండా, లీకేజీ లేకుండా జాగ్రత్తగా లాక్ చేయాలి. కానీ ప్లాంట్ల వద్ద పనిచేసే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దానికి డ్రైవర్ల జోరు తోడై కాంక్రీట్ రోడ్లపై పేరుకుపోతోంది. సిరిపురంలో టైకూన్ హోటల్ నుంచి వీఎంఆర్‌డీఏ భవనం వరకూ రెండు భారీ నిర్మాణాలు జరుగుతున్నాయి. వాటికి పదుల సంఖ్యలో రోజూ ఈ కాంక్రీట్ మిక్సర్లు తిరుగుతున్నాయి. సత్యం జంక్షన్ వద్ద హైవేపై మొదలుకొని బుల్లయ్య కాలేజీ మీదుగా...స్వర్ణభారతి రోడ్డులోకి వెళ్లి అక్కడి నుంచి వీఐపీ మార్గంలో ఆయా నిర్మాణాల వద్దకు వెళుతున్నాయి. ఆ మార్గం అంతా ఇప్పుడు ఈ కాంక్రీట్‌తో ప్రమాద భరితంగా మారింది. ఇలాంటి వాటిని జీవీఎంసీ అధికారులు గుర్తించి వెంటనే జరిమానా విధిస్తుంటారు. ఇంతకు ముందు సాయికాంత్‌వర్మ కమిషనర్‌గా ఉన్నప్పుడు ... మిగతా 6వ పేజీలో

నత్తనడకన రోడ్ల పనులు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పది పనులకు ఎన్‌డీబీ నుంచి రూ.220 కోట్ల రుణం

- నాలుగేళ్లయినా పది శాతం కూడా పూర్తికాని వైనం
- ఇప్పటివరకూ కేవలం రూ.24.56 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తి
- రద్దయ్యే ప్రమాదం

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) రుణం తో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పది రహదారుల పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్లు, భవ నాల శాఖ పరిధిలో గల ఈ రహదారుల పునర్నిర్మాణానికి 2021లో టెండర్లు ఆహ్వానించగా, రాయలసీమ ప్రాంతానికి చెందిన ఒక సంస్థ పనులను దక్కించుకుంది. అయితే, కొన్ని నెలలపాటు పనులు ప్రారంభించలేదు. ఒక మంత్రి సూచనతో ఎన్నికలకు కొన్ని నెలల ముందు పనులను మొదలెట్టింది. అయినా ఇప్పటికీ పది ... మిగతా 6వ పేజీలో



బీఎన్ రోడ్డులో చోడవరం పట్టణంలోని కొత్తూరు జంక్షన్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యి


ఇవీ పనులు వివరాలు..

రోడ్డు	కిలోమీటర్లు	మంజూరైన నిధులు(రూ.కోట్లు)	పూర్తయిన పనుల విలువ(రూ.కోట్లు)
భీమునిపట్నం-నర్సీపట్నం	10.85	రూ.31.45	రూ.0.92
విజయనగరం-పద్మనాభం-శొంఠ్యాం	3.55	రూ.10.04	రూ.2.21
అనకాపల్లి-వెంకన్నపాలెం	5.03	రూ.12.33	రూ.0
సింహాచలం-పినగాడి	7.13	రూ.13.92	రూ.0.62
నర్సీపట్నం-రేవుపోలవరం	9.6	రూ.20.78	రూ.0.15
పాడేరు-పెదబయలు-ముంచంగిపుట్టు	4.98	రూ.11.71	రూ.7.60
నర్సీపట్నం-చింతపల్లి-సీలేరు	1.00	రూ.2.57	రూ.0
వడ్డాది-పాడేరు రోడ్డు	12.7	రూ.23.59	రూ.0.9
భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డు	28.6	రూ.79.81	రూ.10.73
నర్సీపట్నం-తుని రోడ్డు	4.3	రూ.14.42	రూ.1.43

థైరాయిడ్‌తో తంటా

జిల్లాలో పెరుగుతున్న బాధితులు

- కేజీహెచ్‌కు నెలకు 300 మంది వరకూ రాక
- కొత్తగా వ్యాధిబారినపడేవారు 40 నుంచి 50 మంది...
- పురుషుల కంటే మహిళలు అధికం



- లక్షణాలు... బరువు పెరగడం, నిస్సత్తువ, ఒళ్లంతా ఉబ్బినట్టు, మత్తుగా ఉండడం, ఆకలి తగ్గడం, కంగారు, దిగులు, గుండె కొట్టుకునే వేగం పెరగడం
- అశ్రద్ధ చేయవద్దంటున్న వైద్యులు

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):

కొన్నాళ్లుగా థైరాయిడ్ బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గతంతో పోలిస్తే నాలుగు నుంచి ఐదు శాతం మేర పెరిగి నట్టు వైద్యులు చెబుతున్నారు. యుక్త వయస్కుల్లో ఈ సమస్య అధికంగా కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోందంటున్నారు. థైరాయిడ్ కారణంగా అనేక ఇబ్బందులు ఎదురవుతాయని, అందువల్ల సమస్యను సకాలంలో గుర్తించి వైద్యం పొందాలని సూచిస్తున్నారు.

కీలకమైన గ్రంథి

మానవ శరీరంలోని అతి ముఖ్యమైన గ్రంథుల్లో థైరాయిడ్ ఒకటి. శరీర ఎదుగుదలకు, మెదడు పరిపక్వతకు అవసరమయ్యే థైరాక్సిన్ (టి4) అనే హార్మోన్‌ను ఇది ఉత్పత్తి చేస్తుంది. ప్రతి మనిషి జీవ రసాయన ప్రక్రియలకు శరీరంలో ఆరు నుంచి 12 మైక్రో యూనిట్ల థైరాక్సిన్ ఉండాలి. అంతకంటే తక్కువ లేదా ఎక్కువ ఉంటే కొన్నిరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. థైరాయిడ్ గ్రంథి స్వరపేటిక కింది భాగంలో సీతాకోక చిలుక ఆకారంలో శ్వాసనాళానికి ఇరువైపులా ఉంటుంది. ఈ గ్రంథి పనితీరు గతి తప్పడం వల్ల లేదా థైరాక్సిన్ ఎక్కువ లేదా తక్కువ ఉత్పత్తి కావడం వల్ల హైపో థైరాయిడ్, హైపర్ థైరాయిడ్, ... మిగతా 6వ పేజీలో

అభయారణ్యం అభివృద్ధి

- అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా జూ డెవలప్‌మెంట్‌పై ఎంపీ దృష్టి
- పరిశీలించిన సింగపూర్ ప్రతినిధులు
- వీఎంఆర్‌డీఏలో చర్చ
- వన్యప్రాణుల సంఖ్యను పెంచడం, అరుదైన జాతులను రప్పించడం ముఖ్యమన్న కలెక్టర్

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నంలో వన్యప్రాణుల అభయారణ్యం (వైల్డ్ లైఫ్ శాంక్చురీ) అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలపై వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం కీలక ... మిగతా 6వ పేజీలో



సింగపూర్ మాండై వైల్డ్ లైఫ్ ప్రతినిధులతో కలిసి జూ పార్కును పరిశీలిస్తున్న ఎంపీ శ్రీభరత్

కేజీహెచ్‌లో అధ్వానంగా ఆక్సిజన్ ప్లాంట్లు

- నాలుగేళ్ల నుంచి నిర్వహణ నిల్
- వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్లాంట్లను సిద్ధం చేయాలని పైనుంచి ఆదేశాలు

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):

కరోనా తొలి, మలి దశల్లో ఆక్సిజన్ అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. అటువంటి పరిస్థితి పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ఉత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటుచేశాయి. ఈ క్రమంలోనే కేజీహెచ్‌లో కూడా ఆరు ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. ఒక్కొక్క దానికి రూ.87 లక్షల చొప్పున ఆరింటికి రూ.5.22 కోట్లు వెచ్చించారు. ఒక్కో యూనిట్‌లో నిమిషానికి వేయి లీటర్లు ఆక్సిజన్ తయారుచేసే సామర్థ్యం కలిగిన యంత్రాలను ఏర్పాటుచేశారు. అయితే వైరస్ తగ్గుముఖం పట్టిన తరువాత వాటి నిర్వహణను ఆస్పత్రి అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారు. ఇప్పుడు మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశాలు వచ్చాయి. అయితే, ప్రస్తుతం మూడు ప్లాంట్లు పనిచేయడం లేదని చెబుతున్నారు.





కేజీహెచ్‌లోని ఆక్సిజన్ ప్లాంట్‌లోని పరికరాలు. (ఇన్‌సెట్‌లో) ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్

మూడో విడత చందనం అరగదీతకు సన్నాహాలు

» 11న చందన సమర్పణ



చెక్కలను కోస్తున్న సిబ్బంది

సింహాచలం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహునికి మూడో విడత చందన సమర్పణకు సంబంధించి ఏర్పాట్లకు దేవస్థానం అధికారులు శ్రీకారం చుట్టారు. ఏటా వైశాఖ శుక్లపక్ష తదియ అనగా.. చందనోత్సవం రాత్రి తొలి విడత, వైశాఖ మాస పూర్ణిమ రెండవ విడత, మూడవ విడతగా జేష్ఠ మాస పౌర్ణమి నాటి వేకువ జామున చందన సమర్పణ కావించటం సంప్రదాయంగా వస్తోంది. ఈ సంప్రదాయాన్ని అనుసరించి ఈ ఏడాది జేష్ఠ పౌర్ణమి. అనగా ఈ నెల 11న మూడో విడత చందన సమర్పణ చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం దేవాలయ ప్రధానార్చకులు కరి సీతారామాచార్యులు, పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు పర్యవేక్షణలో గంధం చెక్కల కోత చేపటారు. ఆలయ గోల్డ్‌స్మిత్ పండూరి సాంబమూర్తి ఆలయ పద్మనిధి నుంచి గతంలో కొనుగోలు చేసి నిల్వ ఉంచిన మంచి గంధపు చెక్కలను బయటకు తీసి, అరగదీసేందుకు అనుకూలంగా అడుగు పొడవు గల ముక్కలుగా కోశారు. నిబంధలన మేరకు 32 కిలోలు ఉన్న గంధం చెక్కలను పద్మనిధిలో పవిత్ర గంగధార జలాల్లో నానబెట్టి ఉంచారు. జేష్ఠ మాస శుక్ల పక్ష ఏకాదశి అనగా.. ఈ నెల 6 నుంచి మూడో విడత చందనం అరగదీసేందుకు ఆలయ వైదిక కమిటీ ముహూర్తం నిర్ణయించింది.

'వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి'

సింహాచలం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటానికి ఉద్దేశించిన వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని మహా విశాఖ 98వ వార్డు వైసీపీ అధ్యక్షులు కొలుసు ఈశ్వరరావు పిలుపునిచ్చారు. వార్డు కార్యకర్తలతో మంగళవారం ప్రత్యేక సమావేశమై కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఎరువుల వినియోగంపై అవగాహన అవసరం

» జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి

ఆనందపురం, జూన్ 3 : వ్యవసాయంలో ఎరువులు సమతుల్య వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బోని, ఆనందపురం, వెల్లంకి పంచాయతీల్లో భారతీయ వ్యవసాయ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువుల యాజమాన్యం పద్ధతులపై అవగాహన కలిగి ఉండడం అవసరమన్నారు. దీనివల్ల తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి, అందుకు అనుగుణంగా పంటలను వేయాలని సూచించారు. పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తూ తొలకరిలో చేపట్టవలసిన యాజమాన్య చర్యలు గురించి వివరించారు. అలాగే వరి పంటలో నూతన వరి రకాలు అనగా ఎంటీయూ-1224, ఎంటీయూ-262, బీపీటీ-2295, బీపీటీ-2846 రకాల గుణగణాల గురించి రైతులకు వివరించారు. ఉద్యానవన శాఖ పథకాల్లో భాగంగా ఆయిల్‌పామ్ సాగు, కూరగాయలు, విత్తనాలపై రాయితీలు, డ్రిప్ ఇరిగేషన్ గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న పథకాలను వివరిస్తూ వాటిని వినియోగించుకుని అభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖాధికారి ఆర్.సత్యనారాయణ రెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజరు కె.మోహనరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పద్మ, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

సింహాచలం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలు, పుష్ప మాలికలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రత్యక్షంగా పాల్గొన్న 17 జంటల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. శాస్త్ర విధానంలో స్వామి అమ్మవార్లకు, భక్తులకు కంకణధారణ జరిపి నూతన యజ్ఞోపవీత సమర్పణ చేశారు. వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ జీలకర్ర, బెల్లం, మాంగల్యధారణలు చేసి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

గోవా సీఎంతో గంటా భేటీ



గోవా సీఎం ప్రమోద్ సావంత్‌తో చర్చిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బీచ్ పర్యాటకుల స్వర్గధామంగా విలసిల్లుతున్న గోవాలో పర్యాటక ప్రాజెక్టులపై అధ్యయనం చేయడానికి వెళ్లిన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అక్కడి అధికారులతో చర్చించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, పర్యాటక శాఖ మంత్రి రోహన్ ఖవుంటేలతో మాట్లాడి, అక్కడ విజయవంతంగా నడుస్తున్న పర్యాటక ప్రాజెక్టుల వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, ఆ రంగంలో వస్తున్న మార్పులపై మాట్లాడారు. ఏపీలో బీచ్ టూరిజంపై సీఎం చంద్రబాబు ఆసక్తిగా ఉన్నారని, పర్యాటకానికి పరిశ్రమ హోదా కల్పించి రాయితీలు ఇస్తున్నామని వివరించారు.

కోడి వ్యర్థాల టెండర్లు రద్దు

» కూటమి నేతల కుమ్ములాటకు అడ్డుకట్ట

» జీవీఎంసీ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ నిర్ణయం

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని చికెన్ దుకాణాల నుంచి కోడి వ్యర్థాలను సేకరించి, కాపులుప్పాడలోని డంపింగ్‌యారుకు తరలించేందుకు గతంలో కేటాయించిన టెండర్లను జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ రద్దు చేశారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు.

జీవీఎంసీ పరిధిలోని ఎనిమిది జోన్లలోని చికెన్ దుకాణాల నుంచి ఉత్పత్తి అయ్యే కోడివ్యర్థాలను వాహనాల ద్వారా సేకరించి, వాటిని కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు తరలించేందుకు జోన్ల వారీగా జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో ఆరు నెలలు కిందట టెండర్లు పిలిచింది. కోడి వ్యర్థాలకు చేపల చెరువుల కోసం మంచి డిమాండ్ ఉండడంతో చేపల పెంపకందారులు ఎంత ఖర్చు అయినా చికెన్ వ్యర్థాలను కొనడానికి వెనుకాడరు. ఇది కోడివ్యర్థాల సేకరణకు పోటీ పడడానికి కారణంగా మారింది. ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలిచినప్పటికీ టెండర్ దక్కించుకునేందుకు పలువురు పోటీ పడ్డారు. దీంతో కూటమి నేతలను ఆశావహులు ప్రసన్నం చేసుకోవడంతో నేతలు సూచించిన వారికే.. నిబంధనలను పక్కనపెట్టి మరీ టెండర్లు అప్పగించేశారు.

దీనిపై కూటమిలోనే ఇతర నేతలు సిఫార్సు చేసిన వారికి టెండర్లు దక్కకపోవడంతో వారంతా తమ అనుయాయులను అనధికారికంగా కోడివ్యర్థాలు సేకరించుకోవాలని ప్రోత్సహించడంతో వివాదం మొదలైంది. పైగా సేకరించిన కోడి వ్యర్థాలను కాపులుప్పాడ తరలించకుండా, అనకాపల్లి, తూర్పు గోదావరి జిల్లాల్లోని చేపలు చెరువులకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. అనధికార వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేయాలని ఒక వర్గం నేతలు అధికారులపై ఒత్తిడి చేస్తే... పట్టుకున్న అనధికార వాహనాలను విడిచిపెట్టాలంటూ మరో వర్గం నేతలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీనిపై గతనెల 27న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో ఇన్‌చార్జి జీవీఎంసీ కమిషనర్ హరేంధిరప్రసాద్ ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. విచారణలో కోడివ్యర్థాల సేకరణలో నిబంధనలు పాటించడం లేదని తేలడంతో ప్రజారోగ్య విభాగం అధికారులను మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌కు పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత నెల రోజుల్లో 30 అనధికార వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేయడం, కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు వెళ్లాల్సిన వ్యర్థాలు చేపల చెరువులకు తరలించడం, టెండరు దక్కించుకున్న వారు కాకుండా ప్రైవేటు వ్యక్తులు వాహనాలను పెట్టుకుని అనధికారికంగా చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరిస్తుండడం, పత్రికల్లో ప్రతికూల కథనాలు ప్రచురితం కావడం, కొంతమంది కార్పొరేటర్లు దీనిపై ఫిర్యాదు ఇవ్వడం వంటి కారణాలతో టెండర్లను రద్దు చేస్తున్నట్టు జీవీఎంసీ ప్రజారోగ్యవిభాగం అధికారులకు ఇన్‌ఛార్జి కమిషనర్ స్పష్టం చేశారు. వెంటనే దీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు వారి కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తున్నట్టు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

... 5వ పేజీ తరువాయి

పొందేందుకు ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం ఉపయోగపడుతోంది. అయితే, ఆయుష్మాన్ భారత్ పథకం లబ్ధి దారులు దేశంలో ఎక్కడైనా ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు.

ఇకపోతే, జిల్లాలో ఇప్పటివరకూ ఈకే వైసీ పూర్తయిన లబ్ధిదారులకు సంబం. దించిన కార్డులు కొన్నాళ్ల కిందట ఆరోగ్య శాఖ కార్యాలయానికి వచ్చాయి. వాటిని అధికారులు ఇప్ప టికే పంపిణీ చేశారు. ఇకపై ఈకేవైసీ చేయించుకునే లబ్ధిదా రులు నేరుగా ఆన్‌లైన్‌లో కార్డులను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ఆయుష్మాన్ భారత్ లబ్ధిదారుల జాబితా ఇప్పటికే సచి వాల యాలకు అందించామని, ఆ జాబితాలోని లబ్ధిదారులు స్థానిక ఏఎన్ఎం ద్వారా ఈకే వైసీ పూర్తిచేయించుకోవాలని ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కొయ్యాన అప్పారావు సూచించారు.

కాంక్రీట్ మిక్సర్లతో రహదారులు నాశనం

... 5వ పేజీ తరువాయి

ఇలాంటి నిర్లక్ష్యపు పనులు చేసినందును శర్వాణి కాంక్రీట్ మిక్సర్ సంస్థకు జరిమానా విధించారు. పాడు చేసిన రహదారి వ్యయాన్ని వారి నుంచి వసూలు చేశారు. ఆ తరువాత అలాంటి చర్యలు చేపట్టే అధికారులు లేకపోవడంతో వారు ఇష్టానుసారం రహదారులను పాడుచేస్తున్నారు. ఇప్పుడు కలెక్టరే ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు కాబట్టి తక్షణమే ఆయా సంస్థలకు నోటీసులు ఇచ్చి, బాధ్యులను గుర్తించి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

అంతేకాకుండా నగర శివార్లలో అంటే మిధిలాపురి వుడా కాలనీ నుంచి మారికవలస వెళ్లే మార్గంలో ఈ మిక్సర్లు మిగిలిన వ్యర్థాలను రోడ్ల పక్కన కుప్పలుగా పోసి వెళ్లిపోతున్నాయి. చెత్తకుప్పలైతే తరలించగలరు గానీ వాటిని తొలగించే అవకాశం ఉండటం లేదు. ఉద్దేశ పూర్వకంగా చేస్తున్న ఇలాంటి పనులు మళ్లీ జరగకుండా ఆయా సంస్థలకు తగిన హెచ్చరికలు జారీచేయాల్సి ఉంది. నగరంలో శర్వాణితో పాటు నాగార్జున, ఎల్ అండ్ టి, ఆర్‌డీసీ, సత్య, కోస్టల్, అవర్ణ, ఎంవీవీ పేర్లతో మిక్సర్ ప్లాంట్లు నడుస్తున్నాయి. కొందరు భవన నిర్మాతలైతే రహదారి పక్కనే ప్లాంటు పెట్టి అక్కడే కాంక్రీట్ తయారుచేస్తున్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టాల్సి ఉంది.



అమ్మవారి ఊరేగింపు దృశ్యం

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ వార్షిక పండుగ

సింహాచలం, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : అడివివరం తదితర ఏడుగ్రామాల ప్రజల ఆరాధ్య దేవత ముత్యాలమ్మ వార్షిక పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి పాతఅడివివరంలోని ముత్యాలమ్మ శతకం పట్టు వద్ద అమ్మవారిని పూజారి లండ వెంకటరమణ కొలువులోకి తీసుకువచ్చి లోక కల్యాణార్థం అనే సంకల్పంతో ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తదుపరి గరగలను పూజారితో సహా పలువురు భక్తులు శిరస్సున ధరించి అడివివరం శతకం పట్టు నుంచి రామాలయం వీధి, రాజవీధుల మీదుగా విజినిగిరిపాలెంలోని అమ్మవారు ఉన్న ఆలయానికి చేరుకున్న అనుపు ఉత్సవాన్ని జరిపారు.

నత్తనడకన రోడ్ల పనులు

... 5వ పేజీ తరువాయి

శాతం కూడా పూర్తికాలేదు. మొత్తం ఎన్‌డీబీ రుణం రూ.220 కోట్లతో పనులను చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకూ కేవలం రూ.24.56 కోట్ల విలువైనవి మాత్రమే పూర్తయ్యాయంటే ఎంత మందకొడిగా సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. వేగం లేకపోవడం, ఇతర కారణాల వల్ల మంజూరైన పనులు రద్దయ్యే అవకాశం ఉందంటున్నారు. అయితే, దీనిపై అధికారులు మాత్రం పెదవి విప్పడం లేదు. ఇదిలావుంటే మొత్తం పది పనుల్లో రెండు పనులు ఇప్పటివరకూ ప్రారంభమే కాలేదు. మిగిలిన ఎనిమిది కూడా పది శాతం మాత్రమే పూర్తయ్యాయి.

నిలిచిపోయిన పనులు..

మొత్తం 87.74 కిలోమీటర్లు మేర రోడ్ల విస్తరణ, మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం ఎన్‌డీబీ నుంచి రూ.220.62 కోట్ల రుణం తీసుకుంది.

అయితే, ఈ ఏడాది మార్చి ఒకటో తేదీ నాటికి రూ.24.56 కోట్ల విలువజేసే పనులను మాత్రమే పూర్తిచేశారు. వీటికి సంబంధించి రూ.15.32 కోట్ల బిల్లులను చెల్లించగా, మరో రూ.1.16 కోట్ల విలువజేసే బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన బిల్లులు చెల్లించాల్సి ఉంది.



రహదారి వద్ద ఆందోళనకు దిగిన ప్లాట్ల యజమానులు

రహదారి ఆక్రమణపై ప్లాట్ల యజమానుల నిరసన

సాగర్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటి వరకు పార్కులు, గెడ్డలు, ప్రభుత్వభూములు ఆక్రమించడం చూశాము. కాని రుషికొండలో ఏకంగా రహదారినే ఆక్రమించిన ఘనులు ఉన్నారు. రుషికొండ ఎ1 గ్రాండ్ ఎదురుగా బీచ్‌రోడ్డుకు ఆనుకుని ఓ ప్రైవేటు లేఅవుట్ రహదారిని ఆక్రమించడానికి ప్లాన్ వేశారు. బాధితుల తెలిపిన వివరాలు ప్రకారం తమ లేఅవుట్‌కు ఉన్న 30 అడుగుల ప్రధాన రహదారిని ఆక్రమించారని సీతారామనగర్ లేఅవుట్ యజమానులు ఆందోళనకు వ్యక్తం చేశారు. ఈ లేఅవుట్‌లో ఉన్న గృహసముదాయాలకు ఇదే ప్రధాన రహదారని, ఇది ఉండడం వల్లే అపార్టుమెంట్‌కు అప్రూవల్స్ వచ్చాయని యజమానులు సాయిరాజ్, రామకృష్ణరాజ్, చందన్, మూసా తదితరులు పేర్కొన్నారు. దీంతో వారు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు నిర్మాణ పనులను వెంటనే ఆపేయాలని ఇరువర్గాలు తమ స్థలాలకు సంబంధించిన తగిన పత్రాలతో పోలీస్‌స్టేషన్‌కు రావాలని ఆదేశించారు.

దివ్యాంగులకు, వృద్ధులకు ఇంటికే రేషన్ పంపిణీ

పద్మనాభం-రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ రేషన్ డిపోల పరిధిలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వికలాంగులకు, వృద్ధులకు డీలర్లు ఇంటి వద్దకే సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మద్ది, తునిపాలెం, బాందేవుపురం, విజయరాంపురం, రెళ్లికాలనీ తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు ఇంటి దగ్గరకే రేషన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాళ్ల నగేశ్ కుమార్, పలువురు నాయకులు, ఆయా గ్రామాలకు చెందిన డీలర్లు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వం

» సీపీఐ నాయకులు

తగరపువలస, జూన్ 03 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధకారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం తగరపువలస పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ పేదవాడికి మూడు సెంట్ల స్థలాన్ని ఇంటి నిర్మాణానికి కేటాయించాలని, రూ5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏ రకమైన పింఛన్లు అయినా దరఖాస్తు చేసిన వెంటనే అందిస్తామని ఇచ్చిన హామీ కూడా నెరవేర్చలేదని అన్నారు. వితంతువులకు తేదీలతో సంబంధం లేకుండా పింఛన్లు ఇవ్వాలని, అనారోగ్యంతో భాద పడుతున్నవారికి, డయాలసిస్ బాధితులకు పింఛన్లు ఎప్పటికప్పుడు అందించాలని సీపీఐ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వివిధ తీర్మానాలు ఆమోదించారు.

యోగా డేలో భాగంగా బీచ్ క్లీనింగ్

విశాలాక్షినగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా జీవీఎంసీ 9వ వార్డులోని జోడుగుళ్లపాలెం బీచ్‌ను, వాలీబాల్ మైదానాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది మంగళవారం శుభ్రం చేశారు. బీచ్ ప్రాంతాలను శుభ్రపర్చాలనే కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.

కార్యకర్తలే పార్టీకి పునాది

» వైసీపీ భీమిలి కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు



వైసీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస, జూన్ 03 (ఆంధ్రజ్యోతి) పార్టీ బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని భీమిలి నియోజకవర్గ వైసీపీ కన్వీనరు మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం తగరపువలస ఎంఎస్ఆర్ ఫంక్షను హాలులో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, వారి బాగోగుల చూసుకుంటామని అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెన్నుపోటుదినం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. భీమిలి మినీ స్టేడియం నుంచి మెయిన్‌రోడ్డు ద్వారా ప్రదర్శన నిర్వహించి ఆర్‌డీవోకు వినతిపత్రాన్ని అందిస్తామన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ. సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ వెన్నుపోటు దినం కర్యాక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో మండల పరిషత్ అధ్యక్షుడు సూర్యనారాయణరాజు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్ రాజు, భీమిలి మండల ఉపాధ్యక్షుడు బోని బంగారునాయుడు, ఆనందపురం జడ్‌పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు భీమిలి, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కొబ్బరితోట పార్కులో లైట్ల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్





విద్యుత్ దీపాలను బాగుచేస్తున్న దృశ్యం

భీమునిపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా భీమిలి బీచ్ రోడ్‌లో ఉన్న కొబ్బరితోట పార్క్ నిలుస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. మంగళవారం కొబ్బరితోట పార్క్‌లో అంధకారం శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జోన్‌వన్ కార్యాలయం ఇంజనీరింగ్ అధికారులు స్పందించారు. వెంటనే కార్యాలయంలోని ఎలక్ట్రీషియన్లను పార్క్‌లో విద్యుత్ దీపాలను పునరుద్ధపనులకు పంపించారు. జి. 20 సమయంలో పార్క్‌లో సుమారు 60 వరకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి పార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అయితే, 2023 మార్చిలో ఏర్పాటు చేసిన ఈ లైట్లు అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల విద్యుత్ దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. ఇదే అదునుగా మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలకు స్థావరంగా మారింది. మంగళవారం జోనల్ కార్యాలయం ఎలక్ట్రీషియన్లు బాగు చేసే పనులలో నిమగ్నమయ్యారు. ఒక్కరోజులోనే పదిహను విద్యుత్ దీపాలను బాగుచేశారు. మిగిలినవి చోరీలకు గురయ్యాయని తెలుస్తోంది. ఎంతో విలువైన ఎలక్ట్రికల్ లైట్లు, కేబుల్ వైర్లు చోరీకి గురవడం పట్ల అధికారులు ఈ పార్క్ నిర్వహణ పట్ల ఎంత అశ్రద్ధ వహించారో స్పష్టంగా తెలుస్తోంది. రెండు రోజుల్లో మొత్తం పనులు ముగిస్తామని భీమిలి జోన్ అసిస్టెంట్ ఇంజనీరు సురేశ్ అన్నారు. ఈ విషయమై, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జోనల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు వంటల పోటీలు

తగరపువలస, జూన్ 03 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న పాఠశాలలు పునప్రారంభమవుతున్న సందర్భంగా, జీవీఎంసీ 2వ వార్డు పరిధిలో ప్రకృతి పాఠశాలలో పలు పాఠశాలలో వంటలు చేసే ఆయాలకు, బుధవారం వంటలపోటీలు నిర్వహిస్తున్నామని విద్యాశాఖ అధికారులు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పి శివరాణి, ఎ జయప్రద మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు ఈ శిక్షణ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు వంటల పోటీలను అన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామని వారు పేర్కొన్నారు.

వైభవంగా బంగారమ్మ అనుపోత్సవం

పద్మనాభం, జూన్3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజల ఆరాధ్య దైవం బంగారమ్మ అనుపోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ మహోత్సవంలో భాగంగా ముందుగా ఉదయం దుర్గాలమ్మ, పైడితల్లి అమ్మవార్లకు, పోతురాజుకు ఊరేగింపుగా వెళ్లి పసుపు, కుంకుమలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఊరేగింపే అట్టహాసంగా జరిగింది. మీద తాలాడ, బుగత, అవనాపు కుటుంబాలకు చెందిన వారు అమ్మవారి రథం మీద కూర్చుని దేవతను పురవీధుల్లో ఊరేగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భారి సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం, జూన్3(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడరులో లైను పనులు, న్యూబ్రేకర్, ఆర్‌డీఎస్ఎస్ పనులు చేస్తున్న కారణంగా గురువారం విద్యుత్ సరఫర ఉండదని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పద్మనాభం, కృష్ణాపురం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం, శేరిఖండం, రెడ్డిపల్లి, పొట్నూరు, రామయ్యపేట, తునివలస, నర్సాపురం, చిన్నాపురం, నేరేళ్లవలస, కొయ్యపేట, మద్ది, విలాస్‌ఖాన్‌పాలెం, బాందేవపురం, విజయరాంపురం, కుర్రపల్లి, బర్లపేట తదితర గ్రామాలకు ఉదయం 9గం.ల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఘనంగా ఎర్నిమాంబ నెలపండుగ

భీమునిపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మంగమారిపేట గ్రామదేవత శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి నెలపండుగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గరికిన ఎల్లయ్య కింగ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం మహానారాయణ సేవ జరిగింది. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అభయారణ్యం అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

సమావేశం జరిగింది. ఎంపీ ఎం.శ్రీభరత్ ఇటీవల విశాఖ జూ అభివృద్ధిపై దృష్టి సారించారు. అక్కడికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. దానిని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఆ తరువాత సింగపూర్ మాండై వైల్డ్ లైఫ్ ప్రతినిధులతో చర్చించి ఆ బృందాన్ని విశాఖపట్నం రప్పించారు. వారితో కలిసి మంగళవారం జూ, కంబాలకొండ అభయారణ్యం పరిశీలించారు. ఆ తరువాత వీఎంఆర్‌డీలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కమిషనర్ విశ్వనాథన్, జూ అధికారులతో కలిసి సింగపూర్ ప్రతినిధులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభయారణ్యం తయారుకావాలని, అందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ కైలాసగిరి అభివృద్ధికి చేపట్టిన చర్యలు వివరించారు. పర్యాటకులను మరింతగా ఆకర్షించాలని జిప్ లైనర్, స్కై సైక్లింగ్ ఏర్పాటు చేశామని, త్వరలో గ్లాస్ బ్రిడ్జి పూర్తవుతుందన్నారు. రోప్ వేను కూడా ఆధునీకరిస్తున్నామన్నారు. జూ పార్క్ క్యూరేటర్ మంగమ్మ జూ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక వివరించారు. సందర్శకులకు మరింత సౌకర్యంగా ఉండేలా పనులు చేపడతామన్నారు. సింగపూర్ ప్రతినిధులు ఇంకా ఎలాంటి పనులు చేపట్టవచ్చునో వారి ఆలోచనలు పంచుకున్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, వన్యప్రాణుల సంఖ్యను పెంచడం, అరుదైన జాతులను రప్పించడం, వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు.

థైరాయిడ్‌తో తంటా

... 5వ పేజీ తరువాయి

గాయిటర్ వంటి సమస్యలు వస్తాయి.

మహిళల్లో ఎక్కువ

పురుషులతో పోలిస్తే మహిళల్లో థైరాయిడ్ ఎక్కువగా కనిపిస్తోంది. ప్రతి ముగ్గురు బాధితుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. థైరాయిడ్‌తో బాధపడే మహిళల్లో సంతాన లేమి, నెలసరి క్రమం తప్పడం వంటి సమస్యలు కనిపిస్తుంటాయి. ఇంకా బాధితుల్లో బరువు పెరగడం, నిస్సత్తువ, ఒళ్లంతా ఉబ్బినట్టు, మత్తుగా ఉండడం, ఆకలి తగ్గడం, కంగారు, దిగులు, చర్మం పొడిబారడం, కండరాల నొప్పులు, గుండె కొట్టుకునే వేగం పెరగడం, చలి, వేడిని తట్టుకోలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. థైరాయిడ్‌ను నిర్ధారించేందుకు టీ 3, టీ 4, టీఎస్‌హెచ్ వంటి పరీక్షలు నిర్వహిస్తుంటారు. వీటితోపాటు థైరాయిడ్ స్కాన్ చేసి నిర్ధారిస్తారు. కొందరిలో థైరాయిడ్ గ్లాండ్ వాపు వస్తే స్వర పేటిక పరీక్ష నిర్వహిస్తారు. థైరాయిడ్ బాధితుల్లో థైరాయిడ్ కేన్సర్ వచ్చే అవకాశం అరుదుగా ఉంటుంది.

ఇదీ లెక్క..

కేజీహెచ్‌లోని ఎండోక్రైనాలజీ విభాగానికి ప్రతినెలా 300 మంది వరకూ రోగులు వస్తుంటారు. వారిలో కొత్తగా వ్యాధి బారినపడిన వారు 40 నుంచి 50 మంది వరకు ఉంటారని వైద్య లు చెబుతున్నారు. అలాగే, నగర పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లలో మరో వెయ్యి నుంచి రెండు వేల మంది వరకూ రోగులు వైద్య సేవలు పొందుతుంటారు. 35 ఏళ్లలోపు మహిళల్లో ఈ సమస్య అధికంగా కనిపిస్తోంది. గర్భధారణ సమస్యతో వస్తున్న వారికి పరీక్ష చేయించినప్పుడు థైరాయిడ్ ఉన్నట్టు తేలుతోంది.

థైరాయిడ్ వ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దు



థైరాయిడ్ బారినపడినట్టు కొన్ని లక్షణాలు చెబుతుంటాయి. కానీ, చాలామంది పట్టించు కోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. ఇది వారిని మరింత బలహీనపర్చే అవకాశం ఉంది. చిన్నా రుల నుంచి వృద్ధుల వరకూ అందరిలోనూ ఈ సమస్య కనిపిస్తోంది. థైరాయిడ్‌తో బాధపడే అమ్మాయిల్లో సంతానలేమి సమస్య పెరుగు తోంది. సకాలంలో గుర్తించి మందులు వినియోగి స్తే ఈ సమస్య బారినుంచి బయటపడే అవకాశం ఉంది. లక్షణాలు కనిపించిన వెంటనే అప్రమత్తం కావడం అవసరం.

- డాక్టర్ కేఏవీ సుబ్రహ్మణ్యం,
ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

గత ప్రభుత్వం ఎస్సీలకు అన్యాయం చేసింది

» రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్

ఎంవీపీ కాలనీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీలకు అన్యాయం చేసిందని రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ టి.విజయకుమార్ విమర్శించారు. ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులోని ఎస్సీ కార్పొరేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన నిధులను దారి మళ్లించిందన్నారు. ప్రస్తుతం ఎస్సీ మాల యువత కార్పొరేషన్ నిధుల ద్వారా లబ్ధి పొందడానికి ఎదురుచూస్తున్నారని, ఈ కార్పొరేషన్‌కు గత వైభవం తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధంచేస్తున్నామన్నారు. రుణాలు అందించడంలో ఉన్న సమస్యలను తెలుసుకునేందుకు జిల్లాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జీవో నెంబరు 77 రద్దు చేసి, ఫీజు రీ-యింబర్స్‌మెంట్‌ను నేరుగా కళాశాలలకు అందేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నట్టు తెలిపారు. సమావేశంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్లు కొండు మరిడయ్య, సబ్బవరపు గణేష్, సోషల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్య పద్మ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

7న గాదిరాజు ప్యాలెస్‌లో యోగా ప్రదర్శన

ఎంవీపీ కాలనీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్రలో భాగంగా ఈ నెల 7న ఉదయం 6 గంటలకు ఆరు వందల మందితో ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో యోగా ప్రదర్శన నిర్వహించనున్నట్టు ఓం ప్రీ యోగా సంస్థ వ్యవస్థాపకులు చిలక వెంకటరమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారని, యోగాలో పాల్గొనాలనే ఔత్సాహికులు ఫోన్ : 9333333344లో సంప్రదించాలని ఆయన కోరారు.

బోరు బావికి శంకుస్థాపన

ఎంవీపీ కాలనీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏడో సెక్టరు ప్రియదర్శిని కాలనీలో బోరు బావికి కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలారావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో నీటి ఎద్దడి కారణంగా కాలనీ వాసుల వినతి మేరకు జీవీఎంసి నిధులతో బోరు బావి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్టు ఆమె తెలిపారు.

తోటగరువు హైస్కూలు గోదాముకు విద్యా మిత్ర కిట్లు

ఆరిలోవ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పేరుతో విద్యార్థులకు అందించనున్న కిట్లు చేరినట్టు చినగదిలి మండల విద్యాశాఖాధికారి రవీంద్రబాబు తెలిపారు. అన్ని పాఠశాలలకు వీటిని అందజేస్తామన్నారు. పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, నిఘంటువులు, నోటు పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. ఎంఈవో-2 అనూరాధ, సీఆర్‌పీలు, పీటీఐలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 32, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 34, బీరకాయలు 42, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 32 దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)56, బరబాటి 36, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

విజ్ఞానం.. వినోదం మేళవిస్తూ వేసవి శిక్షణ శిబిరం

» ప్రత్యేక పద్ధతిలో సహ-పాఠ్యాంశాల బోధన » ఆసక్తిగా పాల్గొంటున్న చిన్నారులు

ఎంవీపీ కాలనీ, మే 3 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో చిన్నారులు ఇంటికి పరిమితం కాకుండా, ఆ సమయాన్ని వారు సద్వినియోగం చేసుకునేందుకు చక్కని వేదికలు వేసవి శిక్షణ శిబిరాలు. ఈ శిబిరాల్లో విజ్ఞానం, వినోదం కలబోసిన సహ-పాఠ్యాంశాలను బోధించడంతో పిల్లల్లో సృజనాత్మకత పెంపొందే అవకా శం ఉంటుంది. ఏడాది పొడవునా పాఠశాలల్లో పాఠ్యాంశాలు వల్లె వేసే చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరాల్లో బోధించే అంశాలు ప్రత్యేకంగా అనిపిస్తాయి. ముఖ్యంగా.. ఎలాంటి పోటీ వాతావరణం లేకుండా కేవలం నేర్చుకోవడమే ప్రధానంగా నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొనేందుకు చిన్నారులు కూడా ఆసక్తి కనపరుస్తున్నారు. తమకు నచ్చిన సహ-పాఠ్యాంశాలను నేర్చుకునే వెసులుబాటు ఉండడమే దీనికి కారణం.

ఈ ఏడాది ఎంవీపీ కాలనీలోని నగర శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలను ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ సుమారు నాలుగు గంటల



తాము గీసిన చిత్రాలను చూపిస్తున్న చిన్నారులు



యోగా శిక్షణలో విద్యార్థులు

పాటు వివిధ అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ఈ నెల ఆరో తేదీ వరకూ ఈ శిబిరం కొనసాగనుంది.

విజ్ఞానం,. వినోదం

అయిదేళ్ల వయసు ఉంచి పదహారేళ్ల వయసున్న పిల్లలు ఈ శిబిరంలో వివిధ అంశాలను నేర్చుకుంటున్నారు. ప్రతి రోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ బాల సాహిత్యం, దేశ నాయకుల జీవిత చరిత్రలు, దేశభక్తి పెంపొందించే పుస్తకాల పఠనం కార్యక్రమానికి ఓ గంట కేటాయిస్తున్నారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పిల్లలు వారికి ఇష్టమైనవి తీసుకుని చదువుకోవచ్చు. ఇక కథలు చెప్పడం కూడా నేర్పిస్తున్నారు. ఒక అంశాన్ని ఆసక్తికరంగా, కథగా మలచి చెప్పడంలో శిక్షణ అందిస్తున్నారు. వీటిలో ఎక్కువగా నీతి కథలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా చిన్నారుల్లో నైతిక విలువలు పెంపొందించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇక శారీరక, మానసిక వికాసానికి యోగా, ధ్యానం వంటివి నేర్పిస్తున్నారు. చిత్రలేఖనం, గణిత సమస్యల పరిష్కారానికి సులువైన మార్గాలు, నిత్య జీవితంలో సైన్స్ ఉపయోగాలు, బొమ్మల తయారీ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.



చిత్రలేఖనం పోటీల్లో చిన్నారులు

అల్పాహారం అందిస్తూ..

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఇక్కడే ఉండే పిల్లలు ఉంటుండడంతో అల్పాహారం కూడా అందిస్తున్నారు. మధ్యలో ఓ అరగంటా విరామం ప్రకటించి, వారికి మజ్జిగ లేదా పండ్ల రసం, బిస్కెట్స్ వంటివి అందిస్తున్నారు. ఆయా శిక్షణలో మెరుగైన నైపుణ్యం కనపరిచే వారికి దాతల సాయంతో బహుమతులు ఇవ్వనున్నట్టు గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు. అలాగే గ్రంథాలయంలో నిత్యం చదువుకోవడానికి వచ్చే కొందరు విద్యార్థులు, వివిధ అంశాల్లో పేరొందిన వ్యక్తులు తమ వంతుగా పిల్లలకు వివిధ అంశాలను నేర్పిస్తున్నారు.ఇక్కడకు వచ్చే వారంతా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్న తీరును చూసి ప్రశంసిస్తున్నారు.

మృత్యు మార్గానికి మోక్షం

» మద్దిలపాలెం వద్ద రోడ్డు నిర్మాణం పూర్తి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మద్దిలపాలెం వద్ద పనులు పూర్తి చేసిన జాతీయ రహదారి


మద్దిలపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం మృత్యు మార్గం నుంచి మోక్షం లభించింది. అసంపూర్తిగా వదిలేసిన రహదారి నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన వరుస కథనాలతో అధికారులు స్పందించి ఎట్టకేలకు ఈ పనులను పూర్తి చేయించారు. మద్దిలపాలెం నుంచి సత్యం జంక్షన్ వరకు జాతీయ రహదారి నూతన నిర్మాణం చేపట్టారు. సిటీ కార్స్ నుంచి దాదాపు వంద మీటర్ల వరకు వాహనాలు పార్కింగ్ చేయడంతో ఆ ప్రాంతాన్ని విడిచిపెట్టి ఇటీవల రోడ్డు వేశారు. దీనిపై మే 17న 'రోడ్డు నిర్మాణానికి ఆటంకంగా వాహనాల పార్కింగ్' కథనం ప్రచురితమైంది. అయినా అధికారులు స్పందించలేదు. రోడ్డు సగం వేసి విడిచి పెట్టడంతో గతుకుల రోడ్డులో వెళ్లే ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యారు. అంతేకాకుండా మే 23న మెడికో విద్యార్థిని, మే 28న ఓ యువకుడు ఇక్కడే లారీ కింద పడి మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదాలపై కూడా మే 30న 'మృత్యు మార్గంగా మద్దిలపాలెం రహదారి' కథనం ప్రచురితమవడంతో జాతీయ రహదారి సంస (హెచ్‌ఏఐ) అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించి పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

సమతలం కొరవడిన రోడ్డు

అయితే, గతంలో వేసిన రోడ్డుకు అనుకొని ఇప్పుడు వేసిన రోడ్డు కలిసిన ప్రాంతంలో సరిగా కలవకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందంటూ వాహనదారులు వాపోతున్నారు. మద్దిలపాలెం సిగ్నల్స్ నుంచి గురుద్వార్ జంక్షన్ వరకు మలి విడత వేసి రహదారి పొడవునా ఇదే సమస్య ఉందని అంటున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు ఎగుడుదిగుడుగా ఉండడంతో ఇబ్బందిగా ఉందంటూ వాహనదారులు చెబుతున్నారు. గతంలో వదిలేసిన చోట రోడ్డు వేయడం మంచిదే అయినా సక్రమంగా వేయడంపై దృష్టి సారించాల్సిందని అంటున్నారు.

ఇలాంటి సమస్య విశాఖ వ్యాలీ స్కూలు జంక్షన్ సిగ్నల్ నుంచి పాత డెయిరీ ఫారం సిగ్నల్స్ మధ్య రోడ్డులో కూడా ఉందని అంటున్నారు. ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గోల్డ్ మెడల్, స్కాలర్‌షిప్ కోసం విరాళం



డీడీలను అందజేస్తున్న టీఏఐ ఇంజనీర్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ జానకి రామన్‌గణేషన్

వెంకోజీపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ నావెల్ ఆర్కిటెక్చర్ విభాగంలో రాజ్-టి ఏఐ గోల్డ్ మెడల్ ఏర్పాటు చేయడానికి మూడు లక్షల రూపాయల విరాళాన్ని, శిరి అండ్ అనిల్ రాజ్ ఎండోమెంట్ స్కాలర్‌షిప్ ఏర్పాటు చేయడానికి రూ.7,50,000 లు విరాళాన్ని టెక్నాలజీ అసోసియేట్స్ సంస్థ అందించింది. విరాళానికి సంబంధించిన డీడీలను టీఏఐ ఇంజనీర్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ జానకి రామన్ గణేషన్.. ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖ ర్ సమక్షంలో రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావుకు మంగళవారం అందజేశారు. నేవల్ ఆర్కిటెక్చర్, మెరైన్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రతిభ చూపిన విద్యార్థికి గోల్డ్ మెడల్‌ను బహూకరించాలని, అలాగే విద్యలో ప్రతిభ చూపుతూ ఆర్థిక సహాయం అవసరమైన విద్యార్థికి స్కాలర్‌షిప్‌ను బహూకరించాలని దాతలు కోరారు. ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ స్వర్ణ పతకం, స్కాలర్‌షిప్‌కు అవసరమైన నిధులను అందించిన దాతలను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. వీటితో పాటు విద్యార్థులకు నైపుణ్యం పెంపొందించడానికి అవసరమైన ఇంటర్న్‌షిప్‌లు అందించాలని కోరారు. భవిష్యత్తులో సైతం ఇదే విధమైన సహాయాన్ని ఏయూకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి



ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లడానికి వీలు లేకుండా గోతులమయంగా తయారైన రాజరాజేశ్వరిదేవి ఆలయం వీధి రహదారి

మద్దిలపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డులోని మద్దిలపాలెం రాజరాజేశ్వరిదేవి ఆలయం వీధి రహదారి అధ్వాన్నంగా తయారైంది. ఈ వీధిలో మూడు నెలల కిందట అండర్ డ్రైనేజీ పనులు చేపట్టారు. పైపులైన్ల కోసం గోతులు తవ్వారు. పైపు లైన్లు వేసి మట్టితో గోతులను కప్పారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ రహదారిలోని మట్టి కుంగిపోయి రహదారి గోతులుగా మారింది. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ద్విచక్రవాహనాలు ప్రయాణించడానికి వీలు లేకుండా పోయింది.

అలాగే వార్డులో పెద్ద నుయ్యి వద్ద అండర్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా వదిలేశారు. పైపులైన్లు వేసి గోతులను తాత్కాలికంగా కప్పుతున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తవ్విన రోడ్లల నిర్మాణం సక్రమంగా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జూలో జలకళ

ఆరిలోవ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వర్షాలు కురిసిన నేపథ్యంలో ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలలో గల శాంతి సరోవరంలోకి నీరు చేరింది. ఎండాకాలంలో ఈ సరోవరం నీరు ఇంకిపోతుంది. ఈ ఏడాది తొందరగా రుతు పవనాలు రావడంతో వర్షాలు కురిసి శాంతి సరోవరంలోకి నీరు చేరి నట్టు జూ అధికారులు తెలిపారు. దీంతో జూ లో ఉన్న పక్షులు, జంతువులకు నీటి సమస్య తీరిందని పేర్కొన్నారు. శాంతి సరోవరంలో నీరు చేరడంతో ఆ ప్రాంతమంతా చల్లని వాతావరణ నెలకొనడంతో పెలికాన్‌తో పాటు ఇతర పక్షులు ఈ ప్రాంతంలోనే స్థావరాలుగా చేసుకుంటున్నాయి.



వర్షాలు పడడంతో జలకళ సంతరించుకున్న శాంతి సరోవరం

నాస్కామ్ ఉచిత ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వెంకోజీపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, ఏయూ సంయుక్తంగా నాస్కామ్ సహకారంతో విద్యార్థులకు ఈ ఉచిత స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్‌లను అందిస్తున్నట్టు వీసీ తెలిపారు. ఏయూ పరిధిలో 50 వేల మంది ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పిస్తారని దీనికి ఈ నెల 7వ తేదీలోగా ఉన్నత విద్యా మండలి పోర్టల్‌తో విద్యార్థులు తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ ఇంటర్న్‌షిప్‌ను నాలుగు విభాగాల్లో అందిస్తున్నట్టు తెలిపారు. సర్వీస్ నౌ సిస్టం అడ్మినిస్ట్రేటర్, ఎసెంచర్ ఆధ్వర్యంలో ఏఐ ఫండమెంటల్ అండ్ ఏఐ రెడీ ఆఫ్ ఏఐ అసెండ్, గూగుల్ క్లౌడ్ జనరేటివ్ ఏఐ, సేల్స్ ఫోర్స్ డెవలపర్ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. తద్వారా భవిష్యత్తులో విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలను పొందడానికి ఇటువంటి ఇంటర్న్‌షిప్‌లు ఎంతగానో దోహదపడుతుందని వీసీ పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబరు 9052656967కి సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ రీజనల్ హెడ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, నాస్కామ్ ప్రతినిధి ప్రవీణ్‌కుమార్

రైలు ప్రయాణికులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

కూర్మన్నపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని దువ్వాడ రైల్వే స్టేషన్‌లో మంగళవారం మధ్యాహ్నం దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జనరల్ బోగీల ప్రయాణికులకు 260 వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ మాట్లాడుతూ మానవ సేవే-మాధవ సేవ అనే బృహత్తర ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టి నెల రోజులైందన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, పలువురు ఆచార్యులు, విద్యార్థులు

ప్రజా భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యం

» ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్

వెంకోజీపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరి భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ అన్నారు. జూన్ 5 ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే పర్యావరణ దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం వీసీ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితంగా మన జీవన విధానాన్ని మలచుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులుగా నిలిచే బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యాన్ని ఇవ్వాలని సూచించారు. తద్వారా వారు పాఠశాల స్థాయి నుంచి చిన్నారుల్లో పర్యావరణ స్పృహను పెంపొందించడం, సంరక్షించే బాధ్యతను వారిలో పెంపొందించిన వారవుతాయరన్నారు. పర్యావరణ పరిరక్షణ ద్వారా మాత్రమే మానవ మనుగడ సాధ్యపడుతుందనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకుని, తదనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. విద్యా విభాగాధిపతి టి.షారోన్‌రాజు మాట్లాడుతూ ప్రకృతిలో అనేక జీవులు, వృక్షాలు పరస్పరం సహకారంతో ముందుకు సాగుతాయని చెప్పారు. వీటన్నింటిని సంరక్షించడం, పరిరక్షించడం, భావి తరాలకు అందించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని జరుపుతున్నట్టు తెలిపారు. పర్యావరణ శాస్త్ర నిపుణులతో ప్రత్యేక ప్రసంగాలను ఏర్పాటు చేసి పర్యావరణ ప్రాధాన్యాన్ని వివరించడం జరుగుతుందన్నారు. మన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యతను, వృక్షాలను నాటి సంరక్షించే కర్తవ్యాన్ని ప్రతి విద్యార్థి స్వీకరించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ దిశగా మనం వేసే ప్రతి అడుగు భావి తరాలకు ముందడుగుగా నిలుస్తుందన్నారు. నేల సారాన్ని పెంపొందించడం, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ఎంతో అవసరమని చెప్పారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా చెప్పిన 'అమ్మ పేరుతో ఒక మొక్క' సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశించిన విధంగా కోటి మొక్కలు నాటాలనే సంకల్పంలో ప్రతి వ్యక్తి భాగస్వామి కావాలన్నారు. మానవ జీవితం ప్రకృతితో మమేకమై ముందుకు సాగాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వీలైనంత వరకు ప్రకృతి హిత వస్తువులను ఉపయోగించడం ఎంతో అవసరమని చెప్పారు. సరళ జీవన విధానాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో విభాగాచార్యులు ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ ప్రవీణా దేవి, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

వార్డులో సమస్యలు పరిష్కరించండి

» కార్పొరేటర్ శ్రీవిద్యకు 15వ వార్డు వాసుల వినతి



కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యకు సమస్యలు వివరిస్తున్న కాలనీ వాసులు

వెంకోజీపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులోని లక్ష్మీనరసింహనగర్ కొండవాలు ప్రాంతంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యను మంగళవారం కాలనీవాసులు కలిసి విన్నవించుకున్నారు. ఇటీవల నూతన వాటర్ పైపు లైన్లు వేయించినందుకు ముందుగా కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రక్షణ గోడలు లేక చాలా ఇబ్బందిగా ఉందని, వర్షం వచ్చినప్పుడల్లా భయాందోళన చెందుతున్నామని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, ఎప్పటికప్పుడు మ్యాన్‌హోల్స్ పొంగి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోందని కార్పొరేటర్‌కు తెలిపారు.

దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.35 లక్షలు, రక్షణ గోడలు నిర్మాణం కోసం రూ.45 లక్షలు జీవీఎంసీ నిధులు మంజూరు చేయించామని, త్వరలోనే శంకుస్థాపన చేసి అభివృద్ధి పనులను చేపడతామని కాలనీవాసులకు తెలియజేశారు. వార్డులోని అన్ని ప్రాంతాల అభివృద్ధి తమ బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అప్పారి గిరిబాబు, కాలనీ వాసులు కాళ్ల నరసింగరావు, సీపీఐ నాయకులు ఎన్. మధురెడ్డి తదితరులు ఉన్నారు.

యునిసెఫ్ నాయకత్వ శిక్షణకు ఓక్రిడ్జ్ నుంచి నలుగురి ఎంపిక



ఐశ్వర్య



విభా



ఆనందిత



వృశాలి

భీమునిపట్నం (రూరల్) జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగనబంద ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో చదువుతున్న నలుగురు బాలికలు 2025 యునిసెఫ్ నాయకత్వ శిక్షణా శిబిరానికి ఎంపికయ్యారు. ఈ పాఠశాలలో చదువుతున్న ఆనందిత, ఐశ్వర్య, విభా, వృషాలి అనే నలుగురు అమెరికాలో హూస్టన్‌లో ఉన్న ది విలేజ్ స్కూల్ నిర్వహిస్తున్న నార్త్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ (ఎన్‌ఏఈ) యునిసెఫ్ వారు నిర్వహిస్తున్న లీడర్ షిప్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ శైలా భమిడిపాటి తెలిపారు. ఈ విద్యార్థులకు పాఠశాల సోషల్ ఇంపాక్టు లీడర్ మాధురీ గుప్తా నాయకత్వం వహిస్తారని చెప్పారు. వారం పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో ప్రపంచ నలుమూలల నుంచి విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ వర్క్‌షాపులో భాగంగా వీరికి నాయకత్వ శిక్షణ, గ్రూప్ చర్చలు, ప్రాజెక్టుల తయారీ వంటి విషయాలపై అవగాహన కల్పిస్తారని అన్నారు. మూడు సంవత్సరాలుగా తమ విద్యార్థులు యునిసెఫ్ నాయకత్వ శిక్షణకు ఎంపిక అవుతుండడం గర్వకారణమని ప్రిన్సిపాల్ ఆనందం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

» ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేసిన టీఎన్‌టీయూసీ వినతి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకునేలా చూడాలని కోరుతూ ఎంపీ ఎం.శ్రీభరత్‌కు టీఎన్‌టీయూసీ ఉక్కు నాయకులు సోమవారం రాత్రి నగరంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయనకు వివరించారు.

ఎన్నో ఏళ్లుగా ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తప్పించడం భావం కాదన్నారు. ప్రస్తుతం పనులు లేక వారంతా కుటుంబాలతో రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉండీ ఉపయోగం లేని దుకాణ సముదాయం

అక్కయ్యపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నేలపై వ్యాపారం చేస్తున్న వారికి సౌకర్యంగా ఉండడం కోసం నిర్మించిన కూరగాయల దుకాణ సముదాయం నిరుపయోగమైంది. వీటిని వ్యాపారులు ఉపయోగించుకోకుండా రోడ్లపైనే వ్యాపారాలు చేస్తున్నారు. దీనివల్ల రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. గ్రేటర్ 26వ వార్డు జగ్గారావు బ్రిడ్జి వద్ద ఉన్న గెడ్డ దగ్గర కొన్నేళ్ల క్రితం వ్యాపారులు నేలపైనే కూరగాయలు విక్రయిస్తూ, చేపల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. దీంతో జీవీఎంసీ రూ.49.80 లక్షలతో దుకాణ సముదాయాన్ని నిర్మించేందుకు 2017 ఫిబ్రవరి 10న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా మిగిలిపోయిన కూరగాయలు నిల్వ ఉంచడానికి, వ్యాపారులు విశ్రాంతి తీసుకోవడానికి కూడా మరో రూ.30 లక్షలతో అదనపు అంతస్థు నిర్మించారు. దుకాణ సముదాయంలో 27 కూరగాయల స్టాల్స్, 20 చేపలు, మాంసం స్టాల్స్ ఉన్నాయి. కూరగాయల స్టాల్స్‌లో కేవలం అయిదుగురు మాత్రమే వినియోగించుకుంటున్నారు. మిగిలిన వ్యాపారులు దుకాణ సముదాయం ఎదురుగా, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి పొడుగునా తోపుడు బండ్లు, నేలపై వ్యాపారాలు సాగిస్తున్నారు. ఖాళీగా ఉన్న స్టాల్స్‌లో వివిధ వస్తువులు పెట్టి స్టోర్ రూమ్‌గా ఉపయోగించుకుంటున్నారు. దుకాణ సముదాయంలో స్టాల్స్ ఉన్నా రోడ్లపై వ్యాపారాలు సాగించడంతో సుమారు రూ.50 లక్షలు దుర్వినియోగమైందని పలువురు మండిపడుతున్నారు. రోడ్లపై ఎందుకు.. దుకాణ సముదాయం ఉంది కదా! అని ఎవరైనా వ్యాపారులను ప్రశ్నిస్తే తమకు అక్కడ బేరాలు లేవని, తీసుకొచ్చిన కూరగాయలు అమ్ముడవ్వడం లేదని, దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. అంతే కాకుండా తాము వారానికి రూ.50 ఆశీలు పేరిట అద్దె చెల్లిస్తూ స్టాల్స్‌ను కాపాడుకుంటున్నామని చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి రోడ్లపై వ్యాపారం చేయకుండా నిరోధించాలని, ఖాళీగా ఉన్న స్టాల్స్‌ను ఇతర వ్యాపారులకు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.


అక్కయ్యపాలెం ప్రధాన రహదారిపై వ్యాపారాలు


జగ్గారావు బ్రిడ్జి వద్ద నిర్మించిన దుకాణ సముదాయం

గోవా సీఎంతో గంటా భేటీ


గోవా సీఎం ప్రమోద్ సావంత్‌తో చర్చిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బీచ్ పర్యాటకుల స్వర్గధామంగా విలసిల్లుతున్న గోవాలో పర్యాటక ప్రాజెక్టులపై అధ్యయనం చేయడానికి వెళ్లిన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అక్కడి అధికారులతో చర్చించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, పర్యాటక శాఖ మంత్రి రోహన్ ఖవుంటేలతో మాట్లాడి, అక్కడ విజయవంతంగా నడుస్తున్న పర్యాటక ప్రాజెక్టుల వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, ఆ రంగంలో వస్తున్న మార్పులపై మాట్లాడారు. ఏపీలో బీచ్ టూరిజంపై సీఎం చంద్రబాబు ఆసక్తిగా ఉన్నారని, పర్యాటకానికి పరిశ్రమ హోదా కల్పించి రాయితీలు ఇస్తున్నామని వివరించారు.

కోడివ్యర్థాల టెండర్లు రద్దు

» కూటమి నేతల కుమ్ములాటకు అడ్డుకట్ట

» జీవీఎంసీ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ నిర్ణయం

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని చికెన్ దుకాణాల నుంచి కోడి వ్యర్థాలను సేకరించి, కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకి తరలించేందుకు గతంలో కేటాయించిన టెండర్లను జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ రద్దుచేశారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. జీవీఎంసీ పరిధిలోని ఎనిమిది జోన్లలోని చికెన్ దుకాణాల నుంచి ఉత్పత్తి అయ్యే కోడివ్యర్థాలను వాహనాల ద్వారా సేకరించి, వాటిని కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకి తరలించేందుకు జోన్లవారీగా జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో ఆరునెలల కిందట టెండర్లు పిలిచింది. కోడివ్యర్థాలకు చేపల చెరువులకు మంచి డిమాండ్ ఉండడంతో చేపల పెంపకందారులు ఎంత ఖర్చు అయినా చికెన్‌వ్యర్థాలను కొనడానికి వెనుకాడరు. ఇది కోడివ్యర్థాల సేకరణకు పోటీ పడడానికి కారణంగా మారింది. ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలిచినప్పటికీ టెండర్ దక్కించుకునేందుకు పలువురు పోటీపడ్డారు. దీంతో కూటమి నేతలను ఆశావహులు ప్రసన్నం చేసుకోవడంతో నేతలు సూచించినవారికే నిబంధనలను పక్కనపెట్టి టెండర్లు అప్పగించేశారు. దీనిపై కూటమిలోనే ఇతర నేతలు సిఫార్సు చేసినవారికి టెండర్లు దక్కకపోవడంతో వారంతా తమ అనుయాయులను అనధికారికంగా కోడివ్యర్థాలు సేకరించుకోవాలని ప్రోత్సహించడంతో వివాదం మొదలైంది. పైగా సేకరించిన కోడివ్యర్థాలను కాపులుప్పాడ తరలించకుండా, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాలోని చేపల చెరువులకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. అనధికార వాహనాలను పట్టుకుని కేసులు నమోదుచేయాలని ఒకవర్గం నేతలు, పట్టుకున్న వాహనాలను విడిచిపెట్టాలంటూ మరోవర్గం నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీనిపై గత నెల 27న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో ఇన్‌ఛార్జి జీవీఎంసీ కమిషనర్ హరేంధిర ప్రసాద్ పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. కోడివ్యర్థాల సేకరణలో నిబంధనలు పాటించడం లేదని తేలడంతో ప్రజారోగ్య విభాగం అధికారులను మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌కు పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత నెలరోజుల్లో 30 అనధికార వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేయడం, కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకి వెళ్లాల్సిన వ్యర్థాలు చేపల చెరువులకు తరలించడం, టెండరు దక్కించుకున్నవారు కాకుండా ప్రైవేటు వ్యక్తులు వాహనాలను పెట్టుకుని అనధికారికంగా చికెన్‌దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరిస్తుండడం, పత్రికల్లో ప్రతికూల కథనాలు ప్రచురితం కావడం, కొంతమంది కార్పొరేటర్లు దీనిపై ఫిర్యాదు ఇవ్వడం వంటి కారణాలతో టెండర్‌లను రద్దుచేస్తున్నట్టు ఇన్‌ఛార్జి కమిషనర్ జీవీఎంసీ ప్రజారోగ్యవిభాగం అధికారులకు స్పష్టంచేశారు. వెంటనే ఉత్తర్వులు జారీ చేశారు. టెండరు దక్కించుకున్న వారి కాంట్రాక్ట్‌ను రద్దుచేస్తున్నట్టు లిఖితపూర్వక సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

సీతంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో అన్నమయ్య 617వ జయంతి పురస్కరించుకొని విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నమయ్య పద నర్తనం నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. స్టీల్‌ప్లాంట్, గాజువాక, ఉక్కునగరం ప్రాంతాలకు చెందిన పలు నృత్య పాఠశాలల నుంచి శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందుతున్న పలువురు చిన్నారులు అన్నమయ్య కీర్తనలకు లయబద్ధంగా, చక్కని అభినయం చేసి ఆహూతులను అలరించారు. చిన్నారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.



ఓ నృత్య భంగిమలో చిన్నారులు

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

(5వ పేజీ తరువాయి)

పొందేందుకు ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం ఉపయోగపడుతోంది. అయితే, ఆయుష్మాన్ భారత్ పథకం లబ్ధి దారులు దేశంలో ఎక్కడైనా ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు.

ఇకపోతే, జిల్లాలో ఇప్పటివరకూ ఈకే వైసీ పూర్తయిన లబ్ధిదారులకు సంబంధించిన కార్డులు కొన్నాళ్ల కిందట ఆరోగ్య శాఖ కార్యాలయానికి వచ్చాయి. వాటిని అధికారులు ఇప్ప టికే పంపిణీ చేశారు. ఇకపై ఈకేవైసీ చేయించుకునే లబ్ధిదా రులు నేరుగా ఆన్‌లైన్‌లో కార్డులను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ఆయుష్మాన్ భారత్ లబ్ధిదారుల జాబితా ఇప్పటికే సచి వాల యాలకు అందించామని, ఆ జాబితాలోని లబ్ధిదారులు స్థానిక ఏఎన్ఎం ద్వారా ఈకే వైసీ పూర్తిచేయించుకోవాలని ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కొయ్యాన అప్పారావు సూచించారు.

అభయారణ్యం అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

సమావేశం జరిగింది. ఎంపీ ఎం.శ్రీభరత్ ఇటీవల విశాఖ జూ అభివృద్ధిపై దృష్టి సారించారు. అక్కడికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. దానిని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఆ తరువాత సింగపూర్ మాండై వైల్డ్ లైఫ్ ప్రతినిధులతో చర్చించి ఆ బృందాన్ని విశాఖపట్నం రప్పించారు. వారితో కలిసి మంగళవారం జూ, కంబాలకొండ అభయారణ్యం పరిశీలించారు. ఆ తరువాత వీఎంఆర్‌డీలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కమిషనర్ విశ్వనాథన్, జూ అధికారులతో కలిసి సింగపూర్ ప్రతినిధులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభయారణ్యం తయారుకావాలని, అందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ కైలాసగిరి అభివృద్ధికి చేపట్టిన చర్యలు వివరించారు. పర్యాటకులను మరింతగా ఆకర్షించాలని జిప్ లైనర్, స్కై సైక్లింగ్ ఏర్పాటు చేశామని, త్వరలో గ్లాస్ బ్రిడ్జి పూర్తవుతుందన్నారు. రోప్ వేను కూడా ఆధునీకరిస్తున్నామన్నారు. జూ పార్క్ క్యూరేటర్ మంగమ్మ జూ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక వివరించారు. సందర్శకులకు మరింత సౌకర్యంగా ఉండేలా పనులు చేపడతామన్నారు. సింగపూర్ ప్రతినిధులు ఇంకా ఎలాంటి పనులు చేపట్టవచ్చునో వారి ఆలోచనలు పంచుకున్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, వన్యప్రాణుల సంఖ్యను పెంచడం, అరుదైన జాతులను రప్పించడం, వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు.

బహు భాషాసంస్కృతులపై శిక్షణ

మల్రిపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ భాషలు, సంస్కృతులపట్ల విద్యార్థులకు అభిమానం, ఆసక్తి పెంపొందించాలనే ఉద్దేశంతో 104 ఏరియాలోని కేంద్రీయ విద్యాలయం-2లో మే 26 నుంచి జూన్ 2 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు భాషలపై శిక్షణ ఇస్తూ, వారు సులభంగా ఆయా భాషలను అర్థం చేసుకునేలా పాటలు, పద్యాలు, తేలికగా అర్థమయ్యే పదాలను తెలియజేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు అనేక భాషలు, సంస్కృతులు తెలుసుకోవడం వల్ల ప్రాంతీయ భావనలు దూరమై భారతీయత వారి మనస్సులో నాటు కుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతి ప్రకాష్, వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నత్తనడకన రోడ్ల పనులు

(5వ పేజీ తరువాయి)

శాతం కూడా పూర్తికాలేదు. మొత్తం ఎన్‌డీబీ రుణం రూ.220 కోట్లతో పనులను చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకూ కేవలం రూ.24.56 కోట్ల విలువైనవి మాత్రమే పూర్తయ్యాయంటే ఎంత మందకొడిగా సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. వేగం లేకపోవడం, ఇతర కారణాల వల్ల మంజూరైన పనులు రద్దయ్యే అవకాశం ఉందంటున్నారు. అయితే, దీనిపై అధికారులు మాత్రం పెదవి విప్పడం లేదు. ఇదిలావుంటే మొత్తం పది పనుల్లో రెండు పనులు ఇప్పటివరకూ ప్రారంభమే కాలేదు. మిగిలిన ఎనిమిది కూడా పది శాతం మాత్రమే పూర్తయ్యాయి.

నిలిచిపోయిన పనులు..

మొత్తం 87.74 కిలోమీటర్లు రోడ్ల విస్తరణ, మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం ఎన్‌డీబీ నుంచి రూ.220.62 కోట్ల రుణం తీసుకుంది. ఈ ఏడాది మార్చి 1 నాటికి రూ.24.56 కోట్ల విలువజేసే పనులను మాత్రమే పూర్తిచేశారు. వీటికి సంబంధించి రూ.15.32 కోట్ల బిల్లులను చెల్లించగా, మరో రూ.1.16 కోట్ల విలువైన బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన బిల్లులు చెల్లించాల్సి ఉంది.

ఘనంగా కొత్తమ్మ ఉత్సవాలు

అల్లిపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం అమ్మవారి వీధి వాసుల ఆరాధ్య దైవం కొత్తమ్మ మహోత్సవములు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి: సీపీఐ

సీతమ్మధార, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి పార్టీలు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామన్న హామీని కూడా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ప్రతినిధులు మాట్లాడుతూ కొన్ని నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన పేదలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడం గమనార్హం అన్నారు. రాష్ట్ర ప్రజలను సీఎం చంద్రబాబు నాయుడు మరోసారి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



తహసీల్దార్ కార్యాలయం దగ్గర నిరసన తెలుపుతున్న సీపీఐ ప్రతినిధులు

పుస్తక పఠనంతో విజ్ఞానం


పుస్తక పఠనంలో పాల్గొన్న విద్యార్థులు

అల్లిపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పొందవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు అన్నారు. అల్లిపురం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం ఆయన విద్యార్థులకు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పీవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎసెంట్ విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అకడమిక్ డైరెక్టర్ మోజేష్

డాబాగార్డెన్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాల్లో సత్తారు పూజిత కృష్ణ ఆలిండియా కేటగిరి (ఆర్‌సీ)లో 2వ ర్యాంకు, 247, 384, 415, 480, 744 వంటి ర్యాంకులను ఎసెంట్ విద్యార్థులు సాధించారని ఎసెంట్ అకడమిక్ డైరెక్టర్ మోజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 వేలలోపు 34 ర్యాంకులు తమ విద్యార్థులకు రావడం అభినందనీయమన్నారు. ఈ విజయం వెనుక డైరెక్టర్‌లు, అధ్యాపక బృందం కృషి, పట్టుదల ఉన్నాయని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థిలో ప్రతిభను వెలికితీస్తే ఇటువంటి అద్భుతాలు ఎన్నో చేయవచ్చని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపకులను ఆయన అభినందించారు.

మూడు రోజుల్లో 38 శాతం రేషన్ పంపిణీ పూర్తి

» వృద్ధులు, దివ్యాంగుల ఇంటి వద్ద సరకులు అందజేత

మహారాణిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక రేషన్ డిపోల ద్వారా ఇప్పటి వరకు 38 శాతం సరకుల పంపిణీ పూర్తి చేశామని డీలర్లు తెలిపారు. ఈ సందర్భంగా గడిచిన మూడు రోజుల్లో జిల్లాలోని అన్ని రేషన్ డిపోలకు సంబంధించి సుమారు రెండు లక్షల కార్డుదారులు సరకులు తీసుకున్నారు. 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దనే సరకులు అందజేశామని తెలిపారు. జిల్లాలో దివ్యాంగులు, వృద్ధుల కార్డులు 37,701 ఉండగా అందులో 10,374 మందికి తామే స్వయంగా ఇంటికి తీసుకెళ్లి సరకులను అందించామని డీలర్లు చెప్పారు.


వృద్ధురాలికి సరకులు అందిస్తున్న డీలర్

పర్యావరణంపై 5న అవగాహన ర్యాలీ

మురళీనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచన మేరకు ఈ నెల 5న వన మహోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ చేపట్టనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. అనంతరం పార్కులో మొక్కలు నాటుతామన్నారు. పర్యావరణ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 8-30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. నరసింహనగర్, రైతు బజారు ఏరియా, విద్యుత్‌నగర్ ఏరియా, పోర్టు ఈస్ట్‌గేట్ ఏరియా, బాలయ్య శాస్త్రి లేఅవుట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఎస్సీ సబ్‌ప్లాన్ ప్రాజెక్టుల టెండర్లు దళితులకే కేటాయించాలి'



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విదసం ఐక్యవేదిక ప్రతినిధులు

సీతంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో నడిచే వ్యవసాయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, మంచినీటి సరఫరా, విద్యుత్ ప్రాజెక్టులు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు అవసరమయ్యే సరకుల సరఫరా టెండర్లు దళితులకే కేటాయించాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. రామాటాకీస్ రోడ్డులో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఎదురుగా గల అంబేద్కర్ భవన్‌లో విదసం ఆధ్వర్యంలో మంగళవారం తమ డిమాండ్లను నినదిస్తూ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ 2025-26 బడ్జెట్‌లో ఎస్సీ సబ్ ప్లాన్‌కు రూ.20,281 కోట్లను ప్రభుత్వం కేటాయించిదని, దీనిలో స్కూల్ ఫీజులు, అమ్మఒడి, సామాజిక పింఛన్ల పద్దుకు రూ.9 వేల కోట్లు కేటాయించగా, మిగిలిన రూ.11 వేల కోట్లలో వివిధ శాఖల ద్వారా ఎస్సీల కోసం చేపట్టే ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. సబ్ ప్లాన్ నిధులను ఖర్చు చేసే ప్రాజెక్టులు ఏవీ దళితుల చేతుల్లో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కేటాయించిన నిధులతో తమ ఇళ్ల ముందు వేసే రోడ్లు, ఇళ్లు, పైపులు, విద్యుత్ లైన్ల నిర్మాణం బాధ్యతలను దళితులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 750 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 50 రెసిడెన్షియల్ స్కూళ్లలో ఉన్న సుమారు లక్ష మంది విద్యార్థులకు భోజన సరకులు, ఇతర వస్తువుల సరఫరా కాంట్రాక్టర్లకు ప్రభుత్వం రూ.150 కోట్లు చెల్లిస్తుందని, ఇందులోనూ ఒక్కరూ దళితులు లేరని, ఈ టెండర్లు దళిత నిరుద్యోగ యువకులకు కేటాయించాలన్నారు. సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల కాంట్రాక్టులు దళితులకు కేటాయిస్తే వేల దళిత కుటుంబాలు ఆర్థికంగా పురోగమిస్తాయని, కూటమి సర్కారు ఈ దిశగా ఆలోచించి కొత్త నిర్ణయానికి శ్రీకారం చుట్టాలని సూచించారు. విదసం ప్రతినిధులు జాజి ఓంకార్, సోడాదాసి సుధాకర్, బి.భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, కె.చిన్నారావు, డి.నిర్మల, రవిశేఖర, సన్యాసిరావు పాల్గొన్నారు.

కాంక్రీట్ మిక్సర్లతో రహదారులు నాశనం

(5వ పేజీ తరువాయి)

ఇలాంటి నిర్లక్ష్యపు పనులు చేసినందును శర్వాణి కాంక్రీట్ మిక్సర్ సంస్థకు జరిమానా విధించారు. పాడు చేసిన రహదారి వ్యయాన్ని వారి నుంచి వసూలు చేశారు. ఆ తరువాత అలాంటి చర్యలు చేపట్టే అధికారులు లేకపోవడంతో వారు ఇష్టానుసారం రహదారులను పాడుచేస్తున్నారు. ఇప్పుడు కలెక్టరే ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు కాబట్టి తక్షణమే ఆయా సంస్థలకు నోటీసులు ఇచ్చి, బాధ్యులను గుర్తించి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

అంతేకాకుండా నగర శివార్లలో అంటే మిథిలాపురి వుడా కాలనీ నుంచి మారికవలస వెళ్లే మార్గంలో ఈ మిక్సర్లు మిగిలిన వ్యర్థాలను రోడ్ల పక్కన కుప్పలుగా పోసి వెళ్లిపోతున్నాయి. చెత్తకుప్పలైతే తరలించగలరు గానీ వాటిని తొలగించే అవకాశం ఉండటం లేదు. ఉద్దేశ పూర్వకంగా చేస్తున్న ఇలాంటి పనులు మళ్లీ జరగకుండా ఆయా సంస్థలకు తగిన హెచ్చరికలు జారీచేయాల్సి ఉంది. నగరంలో శర్వాణితో పాటు నాగార్జున, ఎల్ అండ్ టి, ఆర్‌డీసీ, సత్య, కోస్టల్, అపర్ణ, ఎంవీవీ పేర్లతో మిక్సర్ ప్లాంట్లు నడుస్తున్నాయి. కొందరు భవన నిర్మాతలైతే రహదారి పక్కనే ప్లాంటు పెట్టి అక్కడే కాంక్రీట్ తయారుచేస్తున్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టాల్సి ఉంది.

థైరాయిడ్‌తో తంటా

(5వ పేజీ తరువాయి)

గాయిటర్ వంటి సమస్యలు వస్తాయి.

మహిళల్లో ఎక్కువ

పురుషులతో పోలిస్తే మహిళల్లో థైరాయిడ్ ఎక్కువగా కనిపిస్తోంది. ప్రతి ముగ్గురు బాధితుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. థైరాయిడ్‌తో బాధపడే మహిళల్లో సంతాన లేమి, నెలసరి క్రమం తప్పడం వంటి సమస్యలు కనిపిస్తుంటాయి. ఇంకా బాధితుల్లో బరువు పెరగడం, నిస్సత్తువ, ఒళ్లంతా ఉబ్బినట్టు, మత్తుగా ఉండడం, ఆకలి తగ్గడం, కంగారు, దిగులు, చర్మం పొడిబారడం, కండరాల నొప్పులు, గుండె కొట్టుకునే వేగం పెరగడం, చలి, వేడిని తట్టుకోలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. థైరాయిడ్‌ను నిర్ధారించేందుకు టీ 3, టీ 4, టీఎస్‌హెచ్ వంటి పరీక్షలు నిర్వహిస్తుంటారు. వీటితోపాటు థైరాయిడ్ స్కాన్ చేసి నిర్ధారిస్తారు. కొందరిలో థైరాయిడ్ గ్లాండ్ వాపు వస్తే స్వర పేటిక పరీక్ష నిర్వహిస్తారు. థైరాయిడ్ బాధితుల్లో థైరాయిడ్ కేన్సర్ వచ్చే అవకాశం అరుదుగా ఉంటుంది.

ఇదీ లెక్క..

కేజీహెచ్‌లోని ఎండోక్రైనాలజీ విభాగానికి ప్రతినెలా 300 మంది వరకూ రోగులు వస్తుంటారు. వారిలో కొత్తగా వ్యాధి బారినపడిన వారు 40 నుంచి 50 మంది వరకు ఉంటారని వైద్యులు చెబుతున్నారు. అలాగే, నగర పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లలో మరో వెయ్యి నుంచి రెండు వేల మంది వరకూ రోగులు వైద్య సేవలు పొందుతుంటారు. 35 ఏళ్లలోపు మహిళల్లో ఈ సమస్య అధికంగా కనిపిస్తోంది. గర్భధారణ సమస్యతో వస్తున్న వారికి పరీక్ష చేయించినప్పుడు థైరాయిడ్ ఉన్నట్టు తేలుతోంది.

థైరాయిడ్ వ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దు



థైరాయిడ్ బారినపడినట్టు కొన్ని లక్షణాలు చెబుతుంటాయి. కానీ, చాలామంది పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. ఇది వారిని మరింత బలహీన పరిచే అవకాశం ఉంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ అందరిలోనూ ఈ సమస్య కనిపిస్తోంది. థైరాయిడ్‌తో బాధపడే అమ్మాయిల్లో సంతానలేమి సమస్య పెరుగుతోంది. సకాలంలో గుర్తించి మందులు వినియోగిస్తే ఈ సమస్య బారినుంచి బయటపడే అవకాశం ఉంది. లక్షణాలు కనిపించిన వెంటనే అప్రమత్తం కావడం అవసరం.

\- డాక్టర్ కేవీవీ సుబ్రహ్మణ్యం, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేసిన టీఎన్‌టీయూసీ నాయకులు


శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకునేలా చూడాలని కోరుతూ ఎంపీ ఎం.శ్రీభరత్‌కు టీఎన్‌టీయూసీ ఉక్కు నాయకులు సోమవారం రాత్రి నగరంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయనకు వివరించారు. ఎన్నో ఏళ్లుగా ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తప్పించడం భావం కాదన్నారు. ప్రస్తుతం పనులు లేక వారంతా కుటుంబాలతో రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల వారిని విధుల్లోకి తీసుకునేలా చూడడంతోపాటు భవిష్యత్తులో కాంట్రాక్టు కార్మికులు ఎవరినీ పనుల నుంచి తొలగించకుండా చూడవల సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు కోగంటి లెనిన్‌బాబు, నమ్మి సింహాద్రి, విళ్ల రామ్మోహన్‌కుమార్ గుమ్మడి నరేంద్ర, కొల్లి శివనాగేశ్వరరావు, ఎ.మణి ఉన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని..

స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తక్షణమే వేతన బకాయిలను చెల్లించాలని కోరుతూ ఇంటక్ నాయకులు మంగళవారం ఉక్కు అధికారులకు వినతిపత్రం అందజేశారు. వేతనాలను సకాలంలో ఇవ్వకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఇంటక్ హయాంలో సాధించుకున్న ఆర్థిక ప్రయోజనాలకు గండిపడిందని, వీటిని పునరుద్ధరించాలన్నారు. టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నవారికి విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికులను తొలగించవద్దు

స్టీల్ ప్లాంటులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించి వారి జీవనోపాధిని దెబ్బతీయవద్దని అధికారులను కార్మిక సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఉక్కు అధికారులతో కార్మిక సంఘ నాయకులు మంగళవారం సమావేశమయ్యారు. ఇటీవల కాంట్రాక్టు కార్మికులను తొలగించడం వల్ల వారు కుటుంబాలతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల భవిష్యత్తులో ఎవరినీ పనుల నుంచి తొలగించరాదని, తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

కార్మికులకు మెరుగైన వైద్య సేవలందించాలి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్, దాని అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు నాణ్యమైన ఈఎస్ఐ వైద్య సదుపాయం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విశాఖ స్టీల్ కాంట్రాక్టు మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి గొందేశి గురప్పరెడ్డి ఈఎస్ఐ బోర్డు సభ్యుడు ఎస్.దుర్గైరాజ్‌కు ప్రాంతీయ ఈఎస్ఐ ఆస్పత్రిలో వినతపత్రం అందజేశారు. ప్లాంటులో సుమారు 14 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పలు విభాగాల్లో పనిచేస్తున్నారని, వీరికి ఈఎస్ఐ ద్వారా సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్నిచోట్ల కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం కూడా లేదన్నారు. అందువల్ల కాంట్రాక్టు కార్మికులకు పూర్తి స్థాయిలో వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మధు, మేఘనదుర్గ, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాస్కామ్ ఉచిత ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తుల ఆహ్వానం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, నాస్కామ్ ప్రతినిధి ప్రవీణ్‌కుమార్

వెంకోజీపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, ఏయూ సంయుక్తంగా నాస్కామ్ సహకారంతో విద్యార్థులకు ఈ ఉచిత స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్‌లను అందిస్తున్నట్టు వీసీ తెలిపారు. ఏయూ పరిధిలో 50 వేల మంది ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పిస్తారని దీనికి ఈ నెల 7వ తేదీలోగా ఉన్నత విద్యా మండలి పోర్టల్‌తో విద్యార్థులు తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ ఇంటర్న్‌షిప్‌ను నాలుగు విభాగాల్లో అందిస్తున్నట్టు తెలిపారు. సర్వీస్ నౌ సిస్టం అడ్మినిస్ట్రేటర్, ఎసెంచర్ ఆధ్వర్యంలో ఏఐ ఫండమెంటల్ అండ్ ఏఐ రెడీ ఆఫ్ ఏఐ అసెండ్, గూగుల్ క్లౌడ్ జనరేటివ్ ఏఐ, సేల్స్ ఫోర్స్ డెవలపర్ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. తద్వారా భవిష్యత్తులో విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలను పొందడానికి ఇటువంటి ఇంటర్న్‌షిప్‌లు ఎంతగానో దోహదపడుతుందని వీసీ పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబరు 9052656967కి సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ రీజనల్ హెడ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు


సింహాచలంలో ఫుట్‌ఓవర్ వంతెన పనులు చేపడుతున్న దృశ్యం

గోపాలపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈ రైల్వే స్టేషన్‌లో రూ.19.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం స్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫాంలు మాత్రమే ఉన్నాయి. దీంతో కొన్ని ముఖ్యమైన రైళ్లు ఆగకపోవడంతో సింహాచలం క్షేత్రానికి వచ్చే భక్తులు నగరంలోని ప్రధాన స్టేషన్‌లో దిగి వెనక్కి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్టేషన్‌లో మరొక ప్లాట్‌ఫాం నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్లాట్‌ఫాం నుంచి స్టేషన్ ప్రాంగణంలోకి ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి వీలుగా అదనంగా కొత్తగా ఫుట్‌ఓవర్ వంతెన నిర్మాణం చేపడుతున్నారు. వచ్చే ఏడాదిలో ప్రయాణికులను అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఆర్థిక సాయం అందజేత

పెదగంట్యాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నడుపూరు హైస్కూల్ 1996-97 టెన్త్ క్లాస్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు కె.శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మంచానికే పరిమితమై వైద్య సేవలు పొందుతున్నారు. ఆయన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న తెలుసుకున్న అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం పెదగంట్యాడలోని ఆయన ఇంటికి వెళ్లి నెలకు సరిపడా నిత్యావసర సరకులు, రూ.20 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు డొమ్మేటి సోమునాయుడు, జి.చిన్న అప్పారావు, పి.అప్పారావు, పెంటయ్యమ్మ, జి.గని, ఎస్.కుంచారావు, పోలిశెట్టి, వెంకునాయుడు, తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన సారె

వైభవంగా దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం

అక్కిరెడ్డిపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): షీలానగర్‌కు ఆనుకుని ఉన్న దుర్గానగర్ కాలనీలోని దుర్గమాంబ ఆలయ 13వ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించగా, ఆలయ ధర్మకర్త కాండ్రేగుల జగ్గారావు దంపతులు తొలి పూజ చేశారు. గవర జగ్గయ్యపాలెం, షీలానగర్,దుర్గానగర్, హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీలకు చెందిన మహిళలు సుమారు 116 రకాల స్వీట్లు, పండ్లు వంటి వాటిని సారె ఊరేగింపుగా తీసుకవచ్చి అమ్మవారిని నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రవేశద్వారం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన అమ్మవారి పాదాలను ఎమ్మెల్యే పి.గణబాబు ప్రతిష్ఠించి పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మొల్లి ముత్యాలనాయుడు, దాడి వెంకటరమేశ్, ఆలయ కమిటీ సభ్యులు కాండ్రేగుల రాజు, గవర సత్తిబాబు, బూలిరాజు, తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధనను కాండ్రేగుల జగ్గారావు దంపతులు ప్రారంభించారు.

మల్కాపురంలో కార్డెన్ సెర్చ్

మల్కాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం కార్డెన్ సెర్చ్‌ను నిర్వహించారు. సీపీ శంఖబ్రత బాగ్చి, జిల్లా అదనపు మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు సీఐ గొలగాని అప్పారావు పర్యవేక్షణలో ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది కార్లను, ఆటోలను, బైక్‌లను నిలిపి తనిఖీలు నిర్వహించారు. పలు చోట్ల ఇళ్లను కూడా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులను విచారించారు. ధ్రువపత్రాలులేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

మల్కాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విశ్లేషణ శక్తి, విమర్శనాశక్తి, సమస్య పరిష్కార మార్గాలు పెంపొందుతాయని ములగాడ ఎంఈవో కె.వెంకటరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బాలల వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం పాల్గొని ఆయన మాట్లాడారు. పుస్తకాలు చదవడంతో నాయకత్వ లక్షణాలు వస్తాయని తెలిపారు. గౌరవఅతిథి తుంపాల శ్రీ రామ్మూర్తి సామాజిక అంశాలపై పిల్లల కు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి ఇవీఎస్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

సినిమా గైడ్

- **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 32, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 34, బీరకాయలు 42, అనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 16, క్యారెట్ 32 దొండకాయలు 26, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది) 56, బరబాటి 36, ముల్లంగి 30, బద్దచిక్కుడు 40, దోసకాయలు 14, నిమ్మకాయలు (కిలో) 80, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 64, గోరుచిక్కుడు 32, దేముడుచిక్కుడు 44, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, బూడిద గుమ్మడికాయ 20, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200


కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలో మంగళవారం ఆయన ఏపీ స్టేట్ ఆరో జూనియర్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ గాజువాకలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. బాక్సింగ్ మంచి క్రీడ అని అన్నారు. యువత క్రీడల్లో రాణిస్తే విద్య, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ పోటీల్లో పలు జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా, ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాలు నిలిచాయి. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, ఉక్కు బాక్సింగ్ క్లబ్ కోచ్ కడియాల శ్రీనివాసరావు, కోచ్‌లు, క్రీడాకారులు చెట్టి వెంకటేశ్, వెంకటరావు, పట్టం కనకారావు, ఎస్.మురళీ, ఎం.కిరణ్, జె.శ్రీను, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో బహుళ ప్రయోజనాలు

ఆటోనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహా భాగ్యమని, ప్రతిరోజూ యోగా చేస్తే బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు అన్నారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం 70వ వార్డులోని కల్యాణ మండపంలో నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పీఎం మోదీ 21న నగరంలో 5 లక్షల మందితో కలిసి యోగాలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమం ప్రపంచ రికార్డు సాధించేలా చూడాలన్నారు. ఆసనాల వల్ల కలిగే ప్రయోజనాలను యోగా గురువు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేనంకొండ కృష్ణంరాజు, శ్రీనివాసరావు, పావని, శంకర్, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులకు వాటర్ బాటిళ్ల పంపిణీ


వాటర్ బాటిళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని దువ్వాడ రైల్వే స్టేషన్‌లో మంగళవారం మధ్యాహ్నం దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జనరల్ బోగీల ప్రయాణికులకు 260 వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ మాట్లాడుతూ మానవ సేవే-మాధవ సేవ అనే బృహత్తర ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టి నెల రోజులైందన్నారు. ఇప్పటివరకు వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో 8,500 వాటర్ బాటిళ్లను రైలు ప్రయాణికులకు పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు జాషువా, రవి, కామేశ్వరరావు, శ్రావణి, విష్ణు, భాస్కరరాజు, రమామణి, రాజేశ్వరరావు, స్ఫూర్తి, తదితరులతో పాటు ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వెన్నుపోట్లకు కేరాఫ్ వైసీపీ అధినేత జగన్

» పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ధ్వజం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో పది శాతం హామీలను కూడా నెరవేర్చకుండా ప్రజలకు వంచనకు గురిచేసి వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ఎద్దేవా చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసి సమావేశంలో గణబాబు మాట్లాడుతూ దొంగే దొం గ అన్న చందంగా వెన్నుపోటు రాజకీయాలకు చిరునామా అయిన జగన్‌రెడ్డి ఎదుటివారిపై బురదజల్లడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. తన తాత రాజారెడ్డి నుంచి జగన్‌కు వెన్ను పోటు చరిత్ర ఉందని అన్నారు. బైరటీస్ గనుల కోసం వెంకట నరసయ్య అనే బీసీ వ్యక్తిని హత్యచేసిన చరిత్ర ప్రజలకు తెలుసునని అన్నారు. కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకుని వేల కోట్ల రూపాయలు సంపాదించి అదే పార్టీకి వెన్నుపోటు పొడిచిన ఘనుడు జగన్‌రెడ్డి అని విమర్శించారు. శివ కుమార్ అనే వ్యక్తి స్థాపించిన వైసీపీని తీసుకుని ఆయనకు వెన్నుపోటు పొడిచిన విషయంమర్చిపోయారని అన్నారు. ఆస్తికోసం తల్లికి, చెల్లికి వెన్నుపోటు, హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలకు, సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి జగన్ కాదా అని ఆయన ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్, మె గా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసగించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల అభివృద్ధి, మత్స్యకారులకు ఆర్థిక సాయం, పింఛన్ల పెంపుదల, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, చెత్త పన్ను రద్దు, ధ్యానం రైతులకు బకాయిలు చెల్లింపు, నాయీ బ్రాహ్మణులకు వేతనాల పెంపు, గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలు, స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు, 74 కేంద్ర పథకాలను పునరుద్ధరించి నిధులు వచ్చేలా చూశామన్నారు. 4500 గ్రామాల్లో రూ. 990 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారంతో సంక్షేమ పాలన అందించిన ఘనత ఈ ప్రభుత్వానిదని గుర్తు చేశారు. ఈ ఏడాదిలో అదుపు తప్పిన పాలనను గాడిలోపెట్టి రాష్ట్రానికి పెట్టుబడులు రాబెడుతూ సంపద సృష్టితో అభివృద్ధి దిశగా నడిపించేందుకు సీఎంచంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి హామీనీ పూర్తి చేస్తామని అన్నారు. ప్రజల పక్షాన శాసనసభలోమాట్లాడి, రాష్ట్రాభివృద్ధికి సలహాలందించాల్సింది పోయి,సాకులతో సభకు రాకుండా అభివృద్ధిని అడ్డుకోడానికి జగన్ చేస్తున్న ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

నేడు 'జగన్ పీడ విరగడై ఏడాది'

» ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు


పీడ విరగడైంది పోస్టర్ ఆవిష్కరిస్తున్న పంచకర్ల, జనసేన నేతలు

పెందుర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు వైసీపీ అధినేత జగన్ పీడ విరగడై ఏడాది కానున్న నేపథ్యంలో సంక్రాంతి, దీపావళి కలబోసి వేడుక చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం సుజాతనగర్‌లోని తన కార్యాలయంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపుమేరకు నిర్వహించనున్న 'జూన్ 4న పీడ విరగడై ఏడాది' కార్యక్రమానికి సంబంధించి పార్టీ శ్రేణులు సన్నద్ధతపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పోస్టర్‌ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీలో అరాచక పాలన సాగించిన వైసీపీ మూకలను ప్రజలు తరిమేసి ఏడాది పూర్తయిందని ఈ క్రమంలో ఉత్సవాలు జరపాలన్నారు. జనసేనతో పాటు కూటమి నేతలంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం సంక్రాంతి ఉట్టిపడేలా, సాయంత్రం దీపావళి కాంతులు విరజిమ్మేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్ అని ఆయన విమర్శించారు. తల్లి, చెల్లిని, బాబాయ్‌లకు జగన్ చేసిన నిర్వాకం ప్రజలకు తెలిసిందేనన్నారు. ఇలాంటి వైసీపీ వెన్నుపోటు కార్యక్రమాన్ని చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సమావేశంలో జనసేన నేతలు అయితి సింహాచలం, గొర్లె అప్పారావు, గొరపల్లి సోమునాయుడు, పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీఎల్‌లో ఆకట్టుకున్న మాక్‌డ్రిల్


గన్స్‌తో ఆక్టోపస్ టీమ్

మల్కాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లి మిటెడ్ (ఐఓసీఎల్) సోమవారం రాత్రి 10 గంటల సమయంలో విశాఖప ట్నం ఆక్టోపస్ అదనపు ఎస్పీ సి. రాజారెడ్డి, ఏసీపీ డి.రాంబాబు ఆధ్వర్యంలో మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. ఉగ్రవాదుల దాడులు ఎలా ఎదుర్కోవాలో అనే అంశంపై తొలుత ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఉగ్ర మూకల దాడి ఎదురైతే ఎలా ప్రతిఘటించాలి, వారి నిరోధం, ఆ సమయంలో అందరినీ ఏ విధంగా అప్రమత్తం చేయాలి...అనేదానిపై ఆక్టోపస్ అధికారులు క్లుణ్ణంగా వివరించారు. అనంతరం కంపెనీలో ప్రదర్శన చేశారు. మాక్ డ్రిల్ జరుగుతున్నంత సేపుఉద్యోగులంతా ఉత్కంఠకు లోనయ్యారు. ఒక్కసారిగా పోలీసులు నల్లటి దుస్తులు ధరించి...చేతిలో గన్స్‌తో ప్రదర్శన చేపట్టారు. ఇందులో బీడీ టీమ్, డీఎంహెచ్‌వో, జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు, జిల్లా అగ్నిమాపక శాఖ, ఐఓసీఎల్ అధికారులు, మల్కాపురం స్టేషన్ సీఐ గొలగాని అప్పారావు, ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలులో విఫలం

» మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



వెన్నుపోటు దినం పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న వైసీపీ నేతలు

పెందుర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను మభ్య పెట్టి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అనంతరం హామీల అమలులో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విమర్శించారు. మండల పరిధి రాంపురంలోని వైసీపీ నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమం సన్నద్ధతపై మంగళవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయన్నారు. వైసీపీ పాలనలో ప్రతీ వర్గానికి సంక్షేమం చేరువైందన్నారు. అలాగే, పెందుర్తిలో కూటమి నేతల కనుసన్నల్లో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల పావుతున్నాయన్నారు. సుజాతనగర్ సమీపాన చెరువు వైసీపీ పాలనలో రూ. 40 లక్షలతో సుందరీకరణ పనులు చేపడితే ఆ చెరువును ఆక్రమించి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారన్నారు. చినముషిడివాడలో నకిలీ పట్టాలతో ప్రభుత్వ భూమి ఆక్రమించి కల్యాణమండపం నిర్మిస్తున్నారని ఆరోపించారు. వెన్నుపోటుదినం సందర్భంగా ఈ అక్రమాలపై ప్రజలకు తెలపాలని కార్యకర్తలకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, అంజి, బయిలపూడి భగవాన్ జయరామ్, మెంటి మహేశ్, గొరపల్లి శ్రీను, నక్క మహేశ్, బీఎస్ రాజు, కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ రోల్‌బాల్ విజేతలకు అభినందన


విజేతలతో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జూన్3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల శ్రీలంకలో జరిగిన ఇంటర్నేషనల్ ఆహ్వాన రోల్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో విజయం సాధించి నగరానికి వచ్చిన టీమ్ సభ్యులు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా విజేతలను సత్కరించి గణబాబు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బాధితులతో నేడు, రేపు గ్రామ సభలు

పెందుర్తి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం నార్త్ సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి లక్ష్మీపురం వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గొడౌన్‌ల వరకు అదనపు రైలు ట్రాక్ నిర్మాణంలో స్థలాలు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం చెల్లించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి రెవెన్యూ రైల్వే అధికారులు ఈ నెల 4, 5తేదీల్లో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు గ్రామ సదస్సులు నిర్వహించనున్నట్టు బాధిత రైతు సంఘం అధ్యక్షుడు గల్లా వెంకటరమణ తెలిపారు. పొర్లుపాలెంలో గ్రామ సభలు నిర్వహిస్తారని, పొర్లుపాలెం, చీమలాపల్లి, చింతలఅగ్రహారంల్లో దండోరా వేయించినట్టు స్థానిక తహసీల్దారు ఆనందకుమార్ తెలిపారు.

ఘనంగా జువ్వాలమ్మ పండగ


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత గోపాలపట్నంలోని జువ్వాలమ్మ అమ్మవారి మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారికి విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనుపు మహోత్సవం నిర్వహించారు.

అభివృద్ధి పనులు పరిశీలన


లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో కాలువ పనులపై ఆరా తీస్తున్న కార్పొరేటర్ బొమ్మిడిరమణ

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో దాదాపు రూ.50లక్షలతో చేపట్టిన రహదారి, కాలువ పనులను గురువారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ పనుల తీరును స్థానికులు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొండవాలు ప్రాంతంలో నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక నిలిపివేసిన పనులను మళ్లీ పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో వార్డు పబ్లిక్‌వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సోమేశ్, స్థానిక నాయకులు మాణిక్యం, రమణ, పట్నాయిక్, సన్నీ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడలో గల సింహాద్రి ఎన్టీపీసీలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌లో మంగళవారం విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. యూనిట్‌కు సంబంధించి బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి అర్థాంతరంగా నిలిచిపోయింది. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు. గురువారం సాయంత్రంకల్లా యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు కృషిచేస్తామని తెలిపారు. మిగతా ఒకటి, రెండు, మూడు యూనిట్‌లలో ఉత్పత్తి కొనసాగుతుందన్నారు.

ఇద్దరు గొలుసు దొంగల అరెస్టు

సీతంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం ప్రాంతంలో ఓ మహిళ మెడ నుంచి బంగారు గొలుసు తెంచుకుపోయిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. అక్కయ్యపాలెం ఎన్‌జీజీఓస్ కాలనీలో నివాసముంటున్న ఓ గృహిణి ఈ నెల 1న బజార్‌కి వెళ్లి ఇంటికి సమీపంలోకి తిరిగి వచ్చేసరికి ద్విచక్రవాహనంపై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో సుమారు మూడు తులాల బంగారు గొలుసును తెంచుకుపోయారు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి దాడి జోషన్‌కుమార్ (29), ఆర్.షణ్ముఖరావు (35)లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వారిని విచారించగా అక్కయ్యపాలెంలో మహిళ గొలుసును వీరే దొంగిలించినట్లు తేలింది. దీంతో వారిని అరెస్టు చేసి మూడు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

విధి వంచిత చిన్నారులపై వాత్సల్యం

400 మందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక చేయూత



- ప్రతినెలా రూ.4 వేల చొప్పున సాయం
- విపత్తులు, ప్రాణాంతక వ్యాధులతో ప్రాణాలు కోల్పోయిన వారి పిల్లలకు అండ

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విధి వంచిత చిన్నారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. విపత్తులు, ప్రాణాంతక వ్యాధులు, అక్రమ రవాణా, ఇతర కారణాల వల్ల తల్లిదండ్రులకు దూరమైన పిల్లలకు, తల్లి లేదా తండ్రిని కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారికి 'మిషన్ వాత్సల్య' పథకంలో భాగంగా ప్రతి నెలా రూ.4 వేల చొప్పున (60:40 నిష్పత్తి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందిస్తున్నాయి. ఈ పథకానికి అర్హులుగా ఎంపికైన 400 మంది చిన్నారులు ప్రస్తుతం ప్రయోజనం పొందుతున్నారు. తల్లి లేదా తండ్రిని కోల్పోయిన చిన్నారులు బాల కార్మికులుగా మారకుండా, బాలికలు బాల్య వివాహాల బారినపడకుండా మెరుగైన విద్య, ఉపాధి పొందేలా ఈ పథకం ఉపకరిస్తోంది. ఈ మొత్తాలను నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. చిన్నారుల చదువు, బాగోగులను కూడా చూసేలా ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. బంధువుల వద్ద ఉండేందుకు చిన్నారులు అంగీకరిస్తే సరే. లేకుంటే హాస్టళ్లలో ఉంటూ చదువుకునే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బాధ్యతను ఐసీడీఎస్ అధికారులకు ప్రభుత్వం అప్పగించింది. ఈ పథకంలో భాగంగా అర్హులైన చిన్నారులు 18 ఏళ్ల వయసు వచ్చే వరకు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వాలు అందించనున్నాయి. ఈ మొత్తంతో చదువు, ఆరోగ్య అవసరాలు తీర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. వీటి కోసం ఇతరులపై ఆధారపడకుండా ప్రభుత్వాలు చేయూత అందిస్తున్నాయి.



వీరే ఎక్కువ..

జిల్లాలో మిషన్ వాత్సల్య పథకం కింద ఆర్థిక సాయం పొందుతున్న చిన్నారుల్లో ఎక్కువ మంది కొవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయినవారు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి పిల్లలు, తల్లిదండ్రుల ఆదరణ కోల్పోయినవారు, ఇతర కారణాల వల్ల తల్లి లేదా తండ్రిని కోల్పోయిన వారు ఉన్నారు. రెండేళ్ల కిందట ఈ పథకంలో భాగంగా లబ్ధి పొందేందుకు సుమారు 10 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. తొలుత 15కుపైగా కేటగిరీలకు చెందిన చిన్నారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి ఆర్థిక సాయం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావించాయి. అయితే, ఆ తరువాత కొవిడ్ బాధితులకు మాత్రమే పరిమితం చేయడంతో వేలాది దరఖాస్తులను తిరస్కరించారు.

ఎనిమిది నెలలుగా పెండింగ్..

మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా చిన్నారులకు అందించే సాయం నేరుగా వారి ఖాతాలో జమ అవుతుంది. ఈ మొత్తం కూడా మూడు నెలలకు ఒకసారి ప్రభుత్వాలు జమ చేస్తాయి. అయితే, గడిచిన ఎనిమిది నెలల నుంచి చిన్నారులకు వాత్సల్య కింద అందాల్సిన సాయం జమ కాలేదు. గత సెప్టెంబరు నుంచి ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

పాలగెడ్డలో మునిగి యువకుడి మృతి

- కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి మృత్యువాత
- సొంతూరు విశాఖలోని అక్కయ్యపాలెం



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



కెరటాల రోషన్ (ఫైల్ ఫొటో)

మాడుగుల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పాలగెడ్డలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన ఒక యువకుడు.. ప్రమాదవశాత్తూ కాలుజారి నీటిలో పడిపోయాడు. అక్కడే వున్న స్నేహితుడు కాపాడడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో నీట మునిగి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి. విశాఖ నగరంలోని అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన కెరటాల రోషన్ (18) మంగళవారం చీడికాడ మండలం ఖండివరం గ్రామానికి చెందిన తన స్నేహితుడి ఇంటికి వచ్చాడు. ఇతని (స్నేహితుడి) తాత మాడుగులలో ఉండడంతో ఇక్కడ జరుగుతున్న మోదకొండమ్మ అమ్మవారి జాతరను తిలకించేందుకు ఇద్దరూ కలిసి మాడుగుల వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు పాలగెడ్డకు వెళ్లారు. రోషన్ ప్రమాదవశాత్తూ నీటిలో పడిపోయి మునిగిపోతూ కేకలు వేశాడు. ఒడ్డున ఉన్న స్నేహితుడు కాపాడడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో రోషన్ నీటిలో మునిగిపోయాడు. అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి గాలించారు. కొద్దిసేపటి తరువాత మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ విషయం తెలుసుకున్న రోషన్ కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు.

'ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి'



వినతిపత్రం సమర్పిస్తున్న అసోసియేషన్ నాయకులు

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె మధుమూర్తి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన్ రావు, కార్యదర్శి కృష్ణమూర్తిని కలిసి ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్ట్) రాష్ట్ర అధ్యక్షుడు అర్జునుడు, ఇతర సభ్యులు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం విజయవాడలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో వారిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో 15 నుంచి 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని వారంతా కోరారు. ఒప్పంద సర్వీసులు పరిగణనలోకి తీసుకుని అసోసియేట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్), ప్రొఫెసర్ (కాంట్రాక్ట్) పదోన్నతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ వుండ్రుకొండ హరిబాబు, డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, కృష్ణ యూనివర్సిటీ నుంచి డాక్టర్ ప్రభాకర్, నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లేకుండానే ఉద్యోగులకు వేతనాలు!

దూరవిద్యల్లో చక్రం తిప్పుతున్న చిరుద్యోగి

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో పని చేసే పలువురు ఉద్యోగులు విధులు లేకుండానే కాలం వెళ్లదీస్తున్నారు. పనిలేకుండానే వేతనాలు తీసుకుంటుండడం పట్ల వర్సిటీలో చర్చ జరుగుతోంది. వీరిలో కంప్యూటర్ సైన్స్, జాగ్రఫీకి చెందిన ఒక్కొక్క అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన మరో నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. ఆరేళ్ల కిందట ఈ కోర్సు రద్దు చేసినప్పటికీ సిబ్బంది మాత్రం కొనసాగుతుండడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అరకొర విధులతో కాలం వెళ్లదీస్తున్న ఈ ఉద్యోగులను మరో చోట నియమించడం వల్ల విద్యార్థులకు మేలు కలుగుతుందని, వారికి బోధన అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఇదే విభాగంలో పని చేసే మరో చిరుద్యోగి కూడా ఇక్కడ చక్రం తిప్పుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇతడే దూర విద్యకు కర్త, కర్మ, క్రియగా మారారన్న విమర్శలు ఉన్నాయి. దూర విద్య పరీక్షా కేంద్రాల నుంచి వసూళ్లు చేయడంలో ఆయనదే కీలక పాత్ర. అందుకు తగ్గట్టుగానే ఆయన దూర విద్య కేంద్రాలకు విద్యార్థుల కేటాయింపు, అబ్జర్వర్ల నియామకం వంటివి చేస్తుంటారని చెబుతున్నారు. సదరు ఉద్యోగికి, దూర విద్యకు సంబంధం లేకపోయినప్పటికీ ఏళ్ల తరబడి ఇక్కడే కొనసాగుతుండడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దూర విద్యను ప్రక్షాళన చేసేందుకు సిద్ధమవుతున్న ఏయూ వైస్‌చాన్సలర్ ఈ వ్యవహారాలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

జగన్ పెద్ద వెన్నుపోటుదారుడు: గండి బాబ్జీ



విలేకరుల సమావేశంలో పాల్గొన్న గండి బాబ్జి, సీతంరాజు సుధాకర్



నిరసన వ్యక్తం చేస్తున్న జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు అనంతలక్ష్మి, తెలుగు మహిళలు

మహారాణిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయలేదంటూ జగన్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ చైర్మన్, టీడీపీ విశాఖ అధ్యక్షుడు గండి బాబ్జి అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీకి వెన్నుపోటు దినం నిర్వహించే హక్కులేదని, జగనే పెద్ద వెన్నుపోటుదారుడని వ్యాఖ్యానించారు. శివకుమార్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని జగన్ తీసుకున్నారని, బాబాయిని గొడ్డలి పోటు పొడిచినప్పుడు వెన్ను పోటు పొడుస్తావా? అంటూ ఎద్దేవా చేశారు. సొంత తల్లికి, చెల్లికి వెన్నుపోటు పొడిచారని, వైసీపీ హయాంలో రాష్ట్రం సర్వనాశనమైందని, మూడు రాజధానుల పేరుతో అమరావతి నిర్మించకుండా ప్రజలను మోసం చేసిన విషయం మరిచావా? అంటూ విమర్శించారు. కూటమి ప్రభుత్వం పింఛన్లను రూ.4 వేలకు పెంచిందని, ఉచిత గ్యాస్ అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సుతో సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 70 శాతం సంక్షేమ పథకాలు అమలు చేశామని గండి బాబ్జి తెలిపారు. టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ జగన్ విధ్వంసంతో పాలన ప్రారంభించారని, అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి విధ్వంసం తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయారని ఆక్షేపించారు. వాలంటీర్ల భవిష్యత్‌మీద దెబ్బ కొట్టాడని, వైసీపీ కార్యకర్త కూడా రోడ్డున పడే పరిస్థితి జగన్ చలవేనని ఎద్దేవా చేశారు.

జగన్ నిరసన పిలుపు ఆక్షేపణీయం

- జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి

సిరిపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెన్ను పోటుదారుడు ఎవరైనా ఉన్నారంటే అది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి ఆరోపించారు. టీడీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో వైసీపీ పాలనలో జగన్ వెన్నుపోటు విధానాన్ని తెలియజేస్తూ మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యపానం నిషేధం అని చెప్పి మహిళలకు వెన్నుపోటు పొడిచింది జగన్ అని విమర్శించారు, యువతకు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ తీస్తానని చెప్పింది.. మూడు రాజధానులు చెప్పి మూడు ముక్కలాట చేసి ఏపీకి రాజధాని లేకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచింది జగన్‌మోహన్‌రెడ్డి కాదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుకున్నది, తల్లిని చెల్లిని గెంటి వేసింది జగన్‌మోహన్‌రెడ్డే అని మండిపడ్డారు. వీటన్నింటినీ చూసిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు జగన్‌కు ఓడించి ప్రజాపాలన తెచ్చుకున్న రోజు జూన్ 4న అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుమహిళా నేతలు రామలక్ష్మి, పద్మ, లక్ష్మి, లావణ్య, బబ్బేలు, భాగ్యలక్ష్మి, సౌజన్య, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన మత్స్యకారుల జాతర

మహారాణిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లకోసారి 45 రోజులు నిర్వహించే ఉత్తరాంధ్ర మత్స్యకారుల ఆరాధ్యదేవతలు పోలమాంబ, భూలోకమాంబ, కొత్తమాంబ అమ్మవార్ల జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. విశాఖ జిల్లా కొత్త జాలరిపేటలో తరతరాలుగా ఈ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మే 5న కోటవీధిలోని మదీనా సాహెబ్ మొక్కు ఇచ్చి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి గంగమ్మవారి కొడికట్టు పండుగతో పాటు కొత్త జాలరిపేట, భీమిలి, పూడిమడక, పెద జాలరిపేట, మల్కాపురం, గంగవరం తదితర 14 మత్స్యకార గ్రామాల భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామ పూజారి చింతపల్లి జంబుబాబు, కులపెద్ద నోల్లు మురళీకృష్ణల ఆధ్వర్యంలో మంగళవారం జాతర ముగింపు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో విద్యుత్ దీపాలంకరణ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. 45 అడుగుల ఎత్తుగల భూలోకమాంబ అమ్మవారి ప్రభ ఊరేగింపు, విద్యుత్ దీపాలంకరణతో తయారు చేసిన ఓడపై కొత్తమాంబ అమ్మవారిని బీచ్‌రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ నుంచి రెల్లివీధి ఏవీఎన్ కళాశాల డౌన్, పూర్ణామార్కెట్ మీదుగా పాత బస్టాండ్ వద్ద ఉన్న అమ్మవారి గుడికి ఊరేగించారు. అందమైన రంగుల బాణసంచాతో పాటు ఉత్తరాంధ్ర సంప్రదాయ సనాతన సాంస్కృతిక నృత్యాలు నాగముప్ప ఒడ్డి వేషాలు, తప్పెటగుళ్ల వంటి సంప్రదాయ నృత్యాలతో వేలాది మంది భక్తులతో ఊరేగింపు నిర్వహించి అమ్మవార్లను ఆలయంలో ప్రతిష్ఠించి వేడుకలు ముగించారు. కార్యక్రమాల నిర్వహణ అధ్యక్షుడు చింతపల్లి పోతురాజు, ఉపాధ్యక్షుడు కాసారపు వెంకటేశ్వర్లు, పెంటయ్య, పిల్లతాతాలు, మాస్టర్లు ఆధ్వర్యంలో పకడ్బందీగా మహోత్సవాలు నిర్వహించారు.



అమ్మవారి ప్రభ ఊరేగింపు, అమ్మవార్లు

ఈఎస్ఐ ఆస్పత్రిని సందర్శించిన డైరెక్టర్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఈఎస్ఐ డైరెక్టర్ దురాయిరాజ్

మల్కాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐ) ఆస్పత్రిని మంగళవారం ఈఎస్ఐ కార్పొరేషన్ డైరెక్టర్ దురాయిరాజ్ సందర్శించారు. ఆస్పత్రిలో రెండు, మూడు గంటల పాటు గడిపి వైద్య సిబ్బందితో మాట్లాడారు. వైద్యసేవలు ఎలా అందుతున్నాయో రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ల్యాబ్‌లో సిబ్బంది పూర్తి స్థాయిలో లేరని, మార్చురీ సదుపాయం, వాహనాల పార్కింగ్‌కు షెడ్డు నిర్మించాల్సి ఉందని సిబ్బంది ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ నాయకులు ఎం.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో దురాయిరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్డుదారుకు రూ.21 వేలు, అంతకంటే తక్కువ వేతనం ఉంటేనే ఈఎస్ఐ వర్తిస్తుందని నిబంధన వల్ల చాలా మంది కార్మికులు నష్టపోతున్నారని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వేతన పరిమితిని రూ.30 వేలకు పెంచాలని కోరారు. స్పందించిన ఈఎస్ఐ సభ్యుడు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు నియోజకవర్గ కేంద్రాల్లో వైసీపీ 'వెన్నుపోటుదినం' నిరసన

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) ఆధ్వర్యంలో 'వెన్నుపోటుదినం' పేరుతో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బుధవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకేరాజు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. తూర్పు, ఉత్తర, దక్షిణ నియోజకవర్గాలకు సంబంధించి వైసీపీ నేతలు, కార్యకర్తలు ఉదయం పది గంటలకు జిల్లా పరిషత్ కూడలి వద్దకు రావాలని పిలుపునిచ్చారు. అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన తెలియజేయాలని కేకే రాజు సూచించారు. మిగిలిన నియోజకవర్గాల కేంద్రాల్లోనే అక్కడి నాయకులు, పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టాలని కేకే రాజు కోరారు. వైసీపీ నిరసన కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో కూటమి నాయకులు పెద్దఎత్తున ఆ పార్టీ ఏలుబడి తీరును దుయ్యబట్టారు.

ఎస్సీ యువత ఆర్థికాభ్యున్నతికి పథకాలు

- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పెదపూడి విజయ్ కుమార్

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ యువత కు ఆర్థికంగా చేయూత అందించే అనేక పథకాలను అమలు చేస్తున్నామని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లా ల పర్యటనలో భాగంగా మంగళవారం విశాఖ వచ్చిన ఆయన ఎంవీపీ కాలనీలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ యువతకు జవసత్వాలు కల్పించాలన్న ఉద్దేశంలో ప్రభుత్వం ఉందన్నారు. అందుకు అనుగుణంగానే అనేక పథకాలు అమలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్టు వెల్లడించారు. ఈ సామాజికవర్గానికి చెందిన ప్రతి ఒక్కరికీ ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందన్నారు. ఈ సామాజికవర్గ ప్రజల ఇబ్బందులు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. అవసరమైన సలహాలు, సూచనలు ఈ సామాజిక వర్గీయులను ఆయన కోరారు. మాల సామాజిక వర్గాన్ని యూనిట్‌గా తీసుకుని కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు గణేష్, మరిడయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్య పద్మ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఐటీఐల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

కంచరపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రైవేటు/ప్రభుత్వ ఐటీఐల్లో కొత్త విద్యా సంవత్సరానికి (ఆగస్టు-2025) ప్రవేశాల ప్రక్రియను ఈ నెల 5 నుంచి ప్రారంభించనున్నట్టు జిల్లా ఐటీఐల కన్వీనర్ జె.శ్రీకాంత్ తెలియజేశారు. కౌన్సెలింగ్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ ఏడాది మొదటి విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ధ్రువపత్రాలను పరిశీలించుకున్న 1,663 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్ చేపట్టి సీట్లు కేటాయిస్తారు. అభ్యర్థులకు ఇప్పటికే వారి ర్యాంకు, కౌన్సెలింగ్ సమయంపై సెల్‌ఫోన్లకు సమాచారం పంపామన్నారు. అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యే సమయంలో అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు వెరిఫికేషన్ చేయించుకున్న రసీదు తీసుకుని రావాలని శ్రీకాంత్ సూచించారు. ప్రతి రోజు రెండు షిఫ్టుల్లో ఉదయం, మధ్యాహ్నం కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. 5న ఉదయం మొదటి ర్యాంకు నుంచి 230వ ర్యాంకు వరకు (జీపీఏ 10-8.3), మధ్యాహ్నం 231వ ర్యాంకు నుంచి 479వ ర్యాంకు వరకు (8.2-7.3), 6న ఉదయం 480వ ర్యాంకు నుంచి 737వ ర్యాంకు వరకు (7.2-6.4), మధ్యాహ్నం 738వ ర్యాంకు నుంచి 1041 ర్యాంకు వరకు (6.3-5.7), 7న ఉదయం 1042వ ర్యాంకు నుంచి 1361వ ర్యాంకు వరకు (5.6-4.6), మధ్యాహ్నం 1362వ ర్యాంకు నుంచి 1663వ ర్యాంకు వరకు (4.5 & అంతకంటే తక్కువ) వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మిగిలిన సీట్లకు మళ్లీ 9వ తేదీ ఉదయం బాలికలు, ఆర్థికంగా వెనుకబడినవారు, దివ్యాంగులు, మాజీ సైనికులు తదితర కేటగిరీ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం మొదటి ర్యాంకు నుంచి 804వ ర్యాంకు వరకు ఉంటుంది. 10న 805వ ర్యాంకు నుంచి చివరి ర్యాంకు 1663 వరకు గల అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని శ్రీకాంత్ తెలియజేశారు.